సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar


సంపుటి: 02 ::: సంచిక:45 | హైదరాబాద్ 14 సెప్టెంబర్ 2026, సోమవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-02 ::: Issue-45 | Hyderabad 14 September 2026, Monday | Pages: 8, Rs. 5/-

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు,
శ్రేయోభిలాషులకు...
వినాయక చతుర్థి
శుభాకాంక్షలు
- మనసర్కార్

నేడు వినాయక చవితి సందర్భంగా
మా కార్యాలయానికి సెలవు.
కావున రేపటి సంచిక వెలువడదు.
పాఠకులు గమనించగలరు.



## అతి త్వరలో...
# యుద్ధం ముగిస్తా



అమెరికాలో త్వరలో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని రాజకీయాంగా దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఇరాన్ పశ్చిమాసియాలో ఉద్దేశపూర్వకంగా యుద్ధాన్ని సాగదీస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు సంధించారు. అమెరికాలో నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ ఉద్రిక్తతలు తగ్గి ఇరాన్-అమెరికా ఘర్షణ అంతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## భారత్‌పై లాడెన్ కుట్ర..
# సీఐఏ వెల్లడి



అమెరికాపై జరిగిన 9/11 ఉగ్రదాడుల నేపథ్యంలో అల్‌ఖైదా అప్పట్లో భారత్‌ను కూడా లక్ష్యంగా చేసుకోవాలని భావించినట్లు అమెరికా నిఘా సంస్థ సీఐఏ విడుదల చేసిన రహస్య పత్రాల ద్వారా తాజాగా వెలుగులోకి వచ్చింది. 9/11 దాడులకు పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా సీఐఏ నాటి ప్రెసిడెన్షియల్ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్స్ కు సంబంధించిన సుమారు 100 పేజీలకు పైగా ఉన్న 70 కీలక పత్రాలను బహిర్గతం చేసింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## ఇరాన్ వాణిజ్య నౌకపై క్షిపణి దాడి
# ఒకరు మృతి



హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఇరాన్‌కు చెందిన ఒక వాణిజ్య నౌకపై గుర్తుతెలియని దుండగులు జరిపిన దాడిలో ఒకరు మృతి చెందారు. బందర్ అబ్బాస్ పోర్ట్ సిటీకి సమీపంలోని ఖేష్మ్ ద్వీప ప్రాంతంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి సమయంలో నౌకలో మొత్తం పది మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మృతి చెందిన బాధితుడు ఏ దేశానికి చెందిన పౌరుడనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## ఆసియా కప్ విజేతగా
# టీమిండియా



మహిళల ఆసియా కప్ 2026 విజేతగా భారత్ నిలిచింది. శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 72 పరుగుల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. 184 పరుగుల భారీ లక్ష్యఛేధనలో బరిలోకి దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.

...::: పూర్తి కథనం 7వ పేజీలో...

## బ్రిక్స్ దేశాల కూటమి కాదు
# ప్రపంచ పరిష్కారాల వ్యవస్థ




ముగింపు సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగం | ఇకపై గ్లోబల్ సౌత్ దేశాల గొంతుక | కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ ప్రాధాన్యం

ఢిల్లీ డిక్లరేషన్ అమలుకు మోదీ పిలుపు | చైనాకు బ్రిక్స్-2027 పగ్గాలు

బ్రిక్స్ కూటమి కేవలం అధికారిక చర్చలకు, సంయుక్త ప్రకటనలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే స్పష్టమైన ఫలితాలను చూపించాల్సిన సమయం వచ్చిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం విజయవంతంగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో ఆమోదించిన 'ఢిల్లీ డిక్లరేషన్'ను కాలపరిమితి పెట్టుకుని అమలు చేయాలని సభ్య దేశాలకు సూచించారు. మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న బ్రిక్స్, ఇకపై కేవలం దేశాల కూటమిగా కాకుండా ప్రపంచ సమస్యలను పరిష్కరించే ఒక బలమైన వ్యవస్థగా రూపాంతరం చెందుతోందని స్పష్టం చేశారు. శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, తదుపరి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్న చైనాకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## ఆర్యవైశ్యులు రాజకీయాల్లో
# సత్తా చాటాలి



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్యుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ మధు యాష్కీ సహా పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య ప్రముఖులు హాజరయ్యారు.

...::: తరువాయి 2వ పేజీలో...



# వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సంక్షేమ పథకాలను బంద్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంద్ చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 286 మంది లబ్ధిదారులకు రూ. 65 లక్షల 60 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే స్పష్టంగా గుర్తించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటికీ కోతలు పెట్టిందని, అందుకే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారని చెప్పారు.సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అక్కసు చూపుతోందని హరీశ్‌రావు మండిపడ్డారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## 80 శాతం భారతీయులు
# నాన్ వెజిటేరియన్లే



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

బ్రిక్స్ సదస్సు ముగింపు సందర్భంగా ఢిల్లీలోని భారత్ మండపంలో విదేశీ ప్రతినిధులకు ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌లో పూర్తిగా శాకాహార వంటకాలే వడ్డించడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత్‌లో దాదాపు 80 శాతం మంది ప్రజలు నాన్‌వెజిటేరియన్లేనని, మన దేశీయ మాంసాహార వంటకాలు ఎంతో రుచికరంగా ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. తన సోదరి ప్రియాంక గాంధీ తయారుచేసే 'ఛోలే భటూరే' ఫొటోను షేర్ చేస్తూ, భారతీయ నాన్ వెజ్ ఫుడ్ కూడా అంతే కమ్మగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన ప్రత్యేక విందులో కేవలం వెజ్ మెనూనే కేటాయించడంపై రాహుల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

**మెనూలో వెజ్ వంటకాలు...**

బ్రిక్స్ సదస్సుకు విచ్చేసిన అంతర్జాతీయ నేతల కోసం భారతీయ సంప్రదాయ రుచులను పరిచయం చేసేలా ప్రత్యేక వెజిటేరియన్ మెనూ రూపొందించారు. స్టార్టర్స్ గా ఖండ్వీ మిల్లే, ఖుంబ్ గలౌటీ (మష్రూమ్ కబాబ్స్)లతో పాటు ప్రధాన వంటకాల్లో పనీర్ లబాబ్దార్, హిమాలయన్ మష్రూమ్స్, క్యారెట్ బీన్ పొరియల్, మిల్లెట్ పులావ్, షాహ్‌తూత్ ఫిర్నీ వంటి డిజర్టర్‌లను వడ్డించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## వీరుల త్యాగాలను
# విస్మరించడం సిగ్గుచేటు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం ను అధికారికంగా నిర్వహించకపోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మండిపడ్డారు. హైదరాబాద్ విమోచన కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరులను గౌరవించడం కంటే, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తమ ఓటు బ్యాంకులను ప్రసన్నం చేసుకోవడమే ముఖ్యంగా కనిపిస్తోందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఆపరేషన్ పోలో అమరవీరులకు తెలంగాణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎన్. రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## నా తప్పనకు మూల్యమే
# ఈ ట్రాఫిక్



**ముంబయి (ఏడీఎన్ఎన్) :**

తాను ట్రాఫిక్ కష్టాలను అనుభవించానంటూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముంబయిలో ఇండోఅమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం నిర్వహించిన 22వ ఇండోఅమెరికన్ కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమానికి ఆయన గంట ఆలస్యంగా హాజరయ్యారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఇదేనా మీ పారదర్శక
# నియామక ప్రక్రియ?



- 65 మార్కుల అభ్యర్థికి టీచర్ పోస్టు ఎలా కట్టబెట్టారు?
- అనర్హుడని జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా తేల్చారు
- అర్హత పరిశీలించకుండా వెరిఫికేషన్ ఎలా చేశారు ?
- ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ ప్రశ్నల వర్షం

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో జరిగిన డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసలు చంద్రబాబు ఇస్తున్న వివరణలే మరిన్ని కొత్త అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలను, అనుమానాస్పద ట్విస్టులను వివరిస్తూ ఆదివారం ఆయన 'ఎక్స్' వేదికగా వరుస ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా డీఎస్సీ నియామకాల్లో వెలుగుచూసిన ట్విస్టులను ఆయన ప్రస్తావించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## బొగ్గు, గనుల రంగాల్లో
# సంస్కరణలు



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బొగ్గు, గనుల రంగాల్లో కీలక సంస్కరణలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 2026 నెలకు సంబంధించి తాను చేపట్టిన పలు కీలక కార్యక్రమాలు, ప్రాజెక్టుల సమీక్షలు, ప్రగతి వివరాలతో కూడిన ప్రత్యేక ఈన్యూస్‌లెటర్‌ను ఆయన సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## 2047 నాటికి ప్రపంచానికి
# ఇండియానే లీడర్



**ముంబయి (ఏడీఎన్ఎన్) :**

భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన వచ్చినా శత్రువుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రధాని నరేంద్ర మోదీ దేశ రక్షణ విధానాన్ని తీర్చిదిద్దారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కొనియాడారు. గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు శత్రువుల భూభాగంలోకి చొరబడి మరీ సమాధానం చెప్పే నాయకత్వం వస్తుందని ఎవరూ ఊహించలేదని పేర్కొన్నారు. ముంబయిలో ఆదివారం జరిగిన 52వ 'ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ అవార్డుల' ప్రదానోత్సవంతో పాటు 'ఆసియాటిక్ సొసైటీ' కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఆంధ్రప్రదేశ్ టెట్
# ఫలితాలు విడుదల




**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) జూన్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.తాజాగా విడుదల చేసిన టెట్ ఫలితాల్లో ఇన్‌సర్వీస్ టీచర్లలో 51 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, రెగ్యులర్ అభ్యర్థుల్లో 47 శాతం మంది అర్హత సాధించినట్లు మంత్రి ప్రకటనలో వెల్లడించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
14.09.2026
www.manasarkar.com

## ఇదేనా మీ పారదర్శక నియామక ప్రక్రియ?

**మొదటిపేజీ తరువాయి....**

టెట్‌లో కేవలం 65 మార్కులు మాత్రమే వచ్చినా సదరు అభ్యర్థికి టీచరు పోస్టు కట్టబెట్టారు. అంతకుముందు ఆ అభ్యర్థి 7 దశల వెరిఫికేషన్ ప్రక్రియను ఎలా విజయవంతంగా పూర్తి చేశాడు? అలాగే ఆ అభ్యర్థి అనర్హుడని జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా తేల్చారు. మరి ఆ 7 దశల పరిశీలనలో అధికారులు అసలు ఏం వెరిఫై చేసినట్లు? సదరు అభ్యర్థికి ఉద్యోగం వచ్చింది.. కానీ అది ఎలా వచ్చిందో స్వయంగా అతనికే తెలియని పరిస్థితి నెలకొంది. మరి అధికారులు ఏడుసార్లు చేసిన వెరిఫికేషన్‌లో ఏం తేల్చారు? 2018లో రాసిన టెట్‌లో అతనికి 77 మార్కులు వచ్చాయని అధికారులు కొత్తగా నిర్ధారించారు. ఆ 77 మార్కులు అప్పటికే రికార్డుల్లో ఉంటే.. అంతకుముందే వాటిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? డీఈవో అతన్ని అనర్హుడిగా ఎందుకు ప్రకటించారు? అసలు ఈ ప్రశ్నలన్నీ లేవనెత్తిన తర్వాతే ఈ వివరణ ఎందుకు బయటకు వచ్చింది? 77 మార్కులు వచ్చినట్లు చెబుతున్నది 'పేపర్ 2'లో కాగా.. ఎస్‌జీటీ పోస్టుకు కచ్చితంగా అవసరమైన టెట్ కేటగిరీ 'పేపర్ IA'. మరి అవేమీ చూడకుండానే అతను 7 దశల వెరిఫికేషన్‌ను ఎలా దాటగలిగాడు? అంతేకాకుండా ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ పరీక్ష రాశాడు. 2018లో వచ్చిన 77 మార్కులతోనే అతనికి పూర్తి అర్హత ఉంటే.. మళ్లీ టెట్ రాయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఈ సందర్భంగా చంద్రబాబును ఉద్దేశించి వైఎస్ జగన్ కొన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తారు. ఇదేనా మీరు చెబుతున్న నిష్పక్షపాతమైన, పారదర్శకమైన నియామక ప్రక్రియ? ఇలాంటి అనుమానాస్పద వ్యవహారాలే డీఎస్సీ స్కామ్‌కు తావివ్వలేదా? చంద్రబాబూ.. ఇప్పటికైనా ఈ అక్రమాలు, స్కాంలకు మీరు నైతిక బాధ్యత వహిస్తారా? లేదా? అని జగన్ ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

## బొగ్గు, గనుల రంగాల్లో సంస్కరణలు

**మొదటిపేజీ తరువాయి....**

భారత మైనింగ్, క్రిటికల్ మినరల్స్ రంగాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో తీసుకొచ్చిన మైన్స్ అండ్ మినరల్స్ సవరణ చట్టం2026కు పార్లమెంటు ఆమోదం లభించడం మైనింగ్ రంగంలో ఓ మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. దీనితో పాటు 'క్రిటికల్ మినరల్స్ ఇన్నోవేషన్ హ్యాకథాన్2026' ప్రారంభం, బొగ్గుగనుల శాఖల కన్సల్టేటివ్ కమిటీ సమావేశం తదితర కీలక ఘట్టాలు ఆగస్టులో చోటుచేసుకున్నట్లు వివరించారు.మరోవైపు, తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల ఆధునీకరణపై దృష్టి సారించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వికారాబాద్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ తదితర రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే కేటో మోటార్స్ ఎలక్ట్రిక్ బస్సు ఆవిష్కరణ, 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం, తిరంగా బైక్ ర్యాలీతో పాటు బీజేపీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. స్వయం సమృద్ధ, 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యంగా తమ కార్యాచరణ నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**మొదటిపేజీ తరువాయి....**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయానికి గతంలో ఇచ్చిన 24 గంటల ఉచిత విద్యుత్‌ను కేవలం 6 గంటలకు కుదించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం మందులు కూడా దొరకని దుస్థితి నెలకొందని, రైతుల సాగునీటి గోస మళ్లీ మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు విడుదల చేయకుండా రంగనాయక సాగర్ జలాశయాన్ని ఎండబెట్టారని విమర్శించారు. రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తాము రాగానే నియోజకవర్గ అభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.తర్వాత అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని వెంకటేశ్వర ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడు దేవుడే కాకుండా ప్రజలందరికీ మార్గదర్శకుడని ఆయన అన్నారు. వినాయకుడి రూపంలోనే మనకు ఎన్నో సందేశాలు ఉన్నాయని, ఆయన పెద్ద తల గొప్పగా ఆలోచించమని, పెద్ద చెవులు ప్రజల మాట వినాలని, చిన్న కళ్లు లక్ష్యంపై దృష్టి పెట్టాలని చెబుతాయన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఎలా ముందుకు సాగాలో ఆయన తొండం నేర్పుతుందన్నారు. విగ్రహాన్ని ఎంత పెద్దగా పెట్టామన్నది ముఖ్యం కాదని.. ఎంత భక్తిశ్రద్ధలతో పూజించామన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించాలని, ఏ గ్రామంలోనైనా, వార్డులోనైనా ఒక్కటే ఒక మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే తాను పర్మినెంట్ షెడ్డు నిర్మించి ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## 2047 నాటికి ప్రపంచానికి ఇండియానే లీడర్

**మొదటిపేజీ తరువాయి....**

2014లో భారత్ 'ఫ్రాజైల్ ఫైవ్' (బలహీనమైన ఐదు దేశాల) జాబితాలో ఉండేదని, నేడు మోదీ సంస్కరణల వల్ల అగ్రశ్రేణి ఐదు దేశాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. 2047 నాటికి భారత్ అన్ని రంగాల్లో ప్రపంచానికే నాయకత్వం వహిస్తుందనే విశ్వాసాన్ని ప్రధాని మోదీ ప్రజల్లో నింపారని స్పష్టం చేశారు. వజ్రాలు, ఆభరణాల రంగానికి భారత్‌లో 6,000 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందన్న అమిత్ షా, ల్యాబ్‌గ్రోన్ (కృత్రిమ) వజ్రాల తయారీపై భారతీయులు పూర్తి పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ మార్పు ప్రస్తుత వజ్రాల మార్కెట్ కంటే 50 రెట్లు విస్తరించే అవకాశం ఉందన్నారు. యంత్రాల తయారీ, డిజైనింగ్, గ్లోబల్ బ్రాండింగ్ నుంచి అంతర్జాతీయ షోరూమ్‌ల నిర్వహణ వరకు ప్రతి అడుగు భారత పారిశ్రామికవేత్తల చేతుల్లోనే ఉండాలని ఆకాంక్షించారు.

**భారతీయ కోణంలో సత్యం...**

డీకాలనైజేషన్ అంటే కేవలం గతాన్ని తుడిచిపెట్టడం కాదని, భారతీయ కోణంలో సత్యాన్ని ప్రామాణికంగా అందించడమేనని షా స్పష్టం చేశారు. బ్రిటీష్‌వారు జ్ఞానాన్ని, అధికారాన్ని ముడిపెట్టిన వలసవాద ఫ్రేమ్‌వర్క్ నుంచి దేశాన్ని విముక్తం చేయాలన్నారు. చరిత్ర, సంస్కృతి, పురాతన గ్రంథాలను కాపాడుకోవడంలో విఫలమైన ఏ దేశమూ మనుగడ సాగించలేదని ఆయన హెచ్చరించారు. మహారాష్ట్రలోని ప్రతి గ్రామంలో ఉన్న తాళపత్ర గ్రంథాలను గుర్తించి 'జ్ఞాన్ భారత్ జాతీయ తాళపత్ర గ్రంథ మిషన్' కిందికి తీసుకురావాలని సూచించారు. ఆసియాటిక్ సొసైటీ వద్ద ఉన్న మహాభారతం, జైన కల్పసూత్రం, బౌద్ధ గ్రంథాల సచిత్ర ప్రతులను డిజిటలైజ్ చేసి, దేశవ్యాప్తంగా పరిశోధకులు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు ఒక ఉమ్మడి ఎలక్ట్రానిక్ వేదికను రూపొందించాలని అమిత్ షా పిలుపునిచ్చారు.

## 80 శాతం భారతీయులు నాన్ వెజిటేరియన్లే

**మొదటిపేజీ తరువాయి....**

**చైనా భేటీపై కాంగ్రెస్ విమర్శలు...**

మరోవైపు బ్రిక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంపై కాంగ్రెస్ పార్టీ ప్రశ్నల వర్షం కురిపించింది. చైనాతో సంబంధాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రంగా విమర్శించారు.

# బ్రిక్స్ దేశాల కూటమి కాదు ప్రపంచ పరిష్కారాల వ్యవస్థ



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

**ఫలితాలే లక్ష్యం-కాలపరిమితితో అమలు...**

సదస్సులో తీసుకున్న నిర్ణయాలు ఫైళ్లకే పరిమితం కాకుండా, చివరి స్థాయి పౌరుడికి కూడా ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా అమలవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. ప్రపంచం బ్రిక్స్ నుంచి ఉత్తి ఆలోచనలు లేదా హామీలను మాత్రమే ఆశించడం లేదని, స్పష్టమైన మార్పును కోరుకుంటోందని అన్నారు. ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత సభ్య దేశాలపై ఉందన్నారు.

**నమ్మకమైన సరఫరా వ్యవస్థలు...**

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ఇంధన భద్రతకు కీలక ఖనిజాలు అత్యంత ప్రాధాన్యంగా మారాయని మోదీ వివరించారు. ఈ వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూనే, సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, వైవిధ్యంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. 'బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్' ద్వారా సరఫరా వ్యవస్థలలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని మోదీ అభిప్రాయపడ్డారు.

**సాంకేతికత అందరికీ అందాలి...**

కీలక ఖనిజాలు, ఆధునిక సాంకేతికతను కొన్ని దేశాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆయుధాలుగా ఉపయోగించుకోవడం వల్ల ఉమ్మడి అభివృద్ధికి విఘాతం కలుగుతుందని ప్రధాని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకునే అవకాశం ప్రపంచంలోని అన్ని దేశాలకూ సమానంగా ఉండాలని స్పష్టం చేశారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్', 'బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్'లను భారత్ ప్రతిపాదించిందని తెలిపారు.

**డిజిటల్ వ్యవసాయం.. గ్లోబల్ సౌత్ నమ్మకం...**

రైతుల సంక్షేమం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), జియోస్పేషియల్ టెక్నాలజీ, డిజిటల్ మౌలిక వసతులను సమర్థంగా వాడుకునేందుకు 'బ్రిక్స్ నెట్‌వర్క్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్'ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను వినిపిస్తూ, వారితో కలిసి నిర్ణయాలు తీసుకోవడం వల్లే బ్రిక్స్‌పై ప్రపంచ దేశాల్లో నమ్మకం పెరుగుతోందన్నారు.

**వైవిధ్యమే అసలైన బలం..**

విభిన్న భౌగోళిక పరిస్థితులు, సంస్కృతులు ఉన్నప్పటికీ మానవాళి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని మోదీ పేర్కొన్నారు. సదస్సును విజయవంతం చేసిన అన్ని దేశాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఢిల్లీ డిక్లరేషన్‌తో బ్రిక్స్ సరికొత్త దిశలో మరింత బలమైన లక్ష్యాలతో పయనిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీజేపీ, కాంగ్రెస్‌కు చెక్.. కేజ్రీవాల్ కొత్త కూటమి

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

వినాయక చవితి పండుగ వేళ గోవా రాజకీయంలో భారీ సంచలనం నమోదైంది. వచ్చే ఏడాది జరగనున్న గోవా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ, విజయ్ సర్దేశాయ్ నేతృత్వంలోని గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) మధ్య పొత్తు ఖరారైంది. ఈ రెండు పార్టీలు ఉమ్మడిగా 'గోవా ఫస్ట్' పేరుతో కూటమిగా ఏర్పడినట్లు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికారికంగా ప్రకటించారు. గోవా వేదికగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడారు . గోవాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లాలూచీ రాజకీయాన్ని అంతమొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

**బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం..**

ఇన్నాళ్లూ గోవా ప్రజలకు బీజేపీ లేదా కాంగ్రెస్ తప్ప మరొక ప్రత్యామ్నాయం లేకపోయింది. కానీ ప్రజలు కోరుకుంటున్న అసలైన, పటిష్టమైన ప్రత్యామ్నాయం 'గోవా ఫస్ట్' కూటమితో సాకారమైందన్నారు. మేం మా స్వశక్తిపైనే ఈ ఎన్నికల్లో పోటీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ ఫిరాయింపుదారులతోనే నడుస్తోంది. దానికి



ఎటువంటి సిద్ధాంతాలు లేవు. ఇది కేవలం సొంత జేబులు నింపుకునే 'పాకెట్ ఫస్ట్' ప్రభుత్వం మాత్రమేన్నారు. ఒక నిజమైన బీజేపీ ఓటరు ఎప్పటికీ కాంగ్రెస్‌కు ఓటు వేయరు. బీజేపీ పాలనపై ఎంత నిరాశ ఉన్నా వారు మా 'గోవా ఫస్ట్' కూటమిని ఆదరిస్తారు కానీ కాంగ్రెస్‌ను మాత్రం నమ్మరని కీలక వ్యాఖ్యలు చేశారు.

**గోవా రాజకీయంలో మలుపులు..**

తాజా కూటమి ఏర్పాటు నేపథ్యంలో గోవా కూటమి రాజకీయాల్లో అనేక మలుపు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2017లో ఎన్నికల తర్వాత గోవా ఫార్వర్డ్ పార్టీ బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 2022 శాసనసభ ఎన్నికల్లో గోవా ఫార్వర్డ్ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఆ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా బరిలోకి దిగింది. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్, జీఎఫ్‌పీ కలసి పోటీ చేశాయి. ప్రస్తుతం రాబోయే ఎన్నికల కోసం ఆప్, జీఎఫ్‌పీ కలసి 'గోవా ఫస్ట్' రూపంలో కొత్త ప్రత్యామ్నాయంగా అవతరించాయి. దీంతో గోవా రాజకీయంలో చోటుచేసుకుంటున్న ఈ వరుస మార్పులు మాండోవి నది మలుపుల కంటే మించిన మలుపులు ఈ కూటమి రాజకీయాల్లో కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇకపై 100 సార్లు చెక్ చేసుకుంటాం..**

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్ సహా 7 మంది రాజ్యసభ ఎంపీల ఫిరాయింపు ఘటనపై కేజ్రీవాల్ తొలిసారి బహిరంగంగా స్పందించారు. మా పార్టీ ద్వారానే వారు రాజ్యసభకు వెళ్లారు. ప్రజలు వారిని నేరుగా ఎన్నుకోలేదు. పార్టీకి వారు తీవ్రమైన ద్రోహం చేశారన్నారు. ఈ పరిణామం మా ఎంపిక విధానంలో ఉన్న బలహీనతను చూపించిందని, ఇది ఆప్‌కు ఒక పెద్ద పాఠం అన్నారు. ఇకపై ఎవరినైనా రాజ్యసభకు పంపే ముందు వారు నమ్మదగినవారా లేదా అని 100 సార్లు వారి విశ్వసనీయతను తనిఖీ చేశాకే నిర్ణయం తీసుకుంటామన్నారు.

## రూ.703 కోట్ల ఇన్సూరెన్స్‌తో గణపయ్య

**ముంబయి (ఏడీఎన్ఎన్) :**

వినాయక చవితి ఉత్సవాలకు యావత్ దేశం సిద్ధమవుతుండగా, మహారాష్ట్రలోని ముంబయి నగరంలో కొలువుదీరే ప్రసిద్ధ జీఎస్‌బీ సేవా మండల్ విఘ్నేశ్వరుడు ఈ ఏడాది సరికొత్త రికార్డుతో వార్తల్లో నిలిచారు. దేశంలోనే అత్యంత సంపన్న గణపయ్యగా పేరొందిన ఈ మండపానికి నిర్వాహకులు ఏకంగా రూ.703.27 కోట్ల మేర భారీ బీమా (ఇన్సూరెన్స్) కవరేజీని తీసుకున్నారు. గతేడాది చేసిన రూ.474 కోట్ల బీమా కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం. ముంబయి శివారులోని మతుంగా కింగ్స్ సర్కిల్ వద్ద జీఎస్‌బీ సేవా మండల్ ఈసారి 72వ వార్షికోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించనుంది. స్వామివారికి సమర్పించే ఆభరణాల విలువ, మండపానికి వచ్చే వేలాది మంది భక్తులు, వాలంటీర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ భారీ బీమాను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

**66 కిలోల బంగారం.. 335 కిలోల వెండితో అలంకరణ...**

మండపంలో కొలువుదీరే మహా గణపతిని అత్యంత కంటికింపుగా, వైభవంగా ముస్తాబు చేయనున్నారు.



ఇందుకోసం భక్తులు, దాతలు సమర్పించిన 66 కిలోల పైచిలుకు పసిడి, 335 కిలోల వెండి ఆభరణాలతో పాటు అరుదైన, విలువైన రత్నాలతో గణపయ్యను దివ్యంగా అలంకరిస్తారు. పర్యావరణ పరిరక్షణను కాపాడేలా పూర్తిగా పర్యావరణ హిత (ఎకో ఫ్రెండ్లీ) మట్టి విగ్రహాన్నే ఇక్కడ ప్రతిష్టిస్తున్నారు. సాధారణంగా పది రోజుల పాటు నవరాత్రులు జరుగుతుండగా, జీఎస్‌బీ మండలి మాత్రం ఈ నెల 14 నుంచి 18 వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, తర్వాత నిమజ్జనం జరుపుతారు.

**డిజిటల్ రశీదులు.. నిత్య అన్నదానం...**

ఈ ఐదు రోజుల ఉత్సవాల్లో వేద సంప్రదాయాల ప్రకారం ధార్మిక కార్యక్రమాలు, యజ్ఞయాగాలు నిర్వహిస్తారు. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా కాగితపు వ్యర్థాలను తగ్గించేందుకు సంప్రదాయ ప్రింటెడ్ రశీదుల స్థానంలో పూర్తిగా డిజిటల్ రశీదుల విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఉత్సవాల కాలంలో ప్రతిరోజూ దాదాపు 40,000 మందికి తగ్గకుండా, మొత్తం ఐదు రోజుల్లో దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులకు మహా ప్రసాదంతో అన్నదానం చేయనున్నట్లు మండలి ప్రతినిధి అమిత్ పాయ్ వెల్లడించారు.

**పుదుచ్చేరి విద్యార్థుల గణేశుడు...**

మరోవైపు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని జీవానందం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సృజనాత్మకతతో అందరినీ ఆకట్టుకున్నారు. వాడి పడేసిన కాగితాలను రీసైకిల్ చేసి, ఐదు అడుగుల ఎత్తైన సుందరమైన గణేశుని విగ్రహాన్ని తయారుచేశారు. ఈ పర్యావరణహిత వినాయక విగ్రహం ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ అందరి ప్రశంసలు అందుకుంటోంది.



## మోదీని కలిసిన స్కూల్ ఫ్రెండ్ భూవివాదంపై విజ్ఞప్తి

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ప్రధాని నరేంద్ర మోదీని ఆయన చిన్ననాటి పాఠశాల స్నేహితుడు అస్గర్‌అలీ వోహ్రా ఇటీవల ఢిల్లీలోని ప్రధాని నివాసంలో కలిశారు. గుజరాత్‌లోని వడ్నగర్ బీఎన్ హైస్కూల్‌లో మోదీతో కలిసి చదువుకున్న వోహ్రా, దశాబ్దాలుగా తాను ఎదుర్కొంటున్న భూవివాదంపై ప్రధానికి విన్నవించుకున్నారు. బీజేపీ ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు చెందిన సెవెన్ ఎలెవెన్ కన్‌స్ట్రక్షన్స్ తో సహా కొందరు బిల్డర్లు నకిలీ పత్రాలు సృష్టించి, భయందర్ ఈస్ట్ లో ఉన్న తన 2,810 చదరపు మీటర్ల విలువైన స్థలాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని వోహ్రా వాపోయారు.

**అధికారుల నిర్లక్ష్యం.. సీబీఐ విచారణకు విజ్ఞప్తి..**

ఈ అక్రమంపై పోలీసులకు, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వోహ్రా ఆవేదన వ్యక్తం చేశారు. 2015లో నమోదైన ఎఫ్ఐఆర్‌పై ఏళ్ల తరబడి జాప్యం చేసి ఇటీవల కోర్టుకు నివేదిక ఇచ్చారని, పైగా నిందితులే తనపై ఎదురు కేసులు పెట్టారని తెలిపారు. అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి, రాజకీయ బెదిరింపుల నేపథ్యంలో ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని ప్రధానిని కోరారు. ఈ వ్యవహారంపై స్పందించిన మోదీ ఆయనకు ధైర్యం చెప్పి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ భూవివాదం కేసుపై ఈ నెల 16న కోర్టులో విచారణ జరగనుంది.

## ఉపఎన్నికకు దీదీ దూరం



**కోల్‌కతా (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరి నుంచి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వైదొలిగారు. నందిగ్రామ్ ఉపఎన్నికకు టీఎంసీ అభ్యర్థిగా సంచిత ప్రధాన్‌ను, రేజీనగర్ స్థానానికి ఆలమ్ ఛౌదరిని బరిలోకి దించుతున్నట్లు ఆ పార్టీ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమిపాలై బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకోగా, మమత స్వయంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. నందిగ్రామ్ నుంచి దీదీ పోటీ చేస్తే తాము అభ్యర్థిని నిలబెట్టబోమని టీఎంసీ రెబల్ వర్గం ఆఫర్ ఇచ్చినప్పటికీ, ఆమె అసెంబ్లీకి వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీంతో గత 15 ఏళ్లలో తొలిసారిగా మమతా బెనర్జీ శాసనసభలో లేకపోవడం గమనార్హం. గత 2026 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్, నందిగ్రామ్ రెండు స్థానాల నుంచి పోటీ చేసిన బీజేపీ నేత సువేందు అధికారి భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. రెండు చోట్లా గెలిచిన ఆయన నందిగ్రామ్ స్థానానికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. రేజీనగర్ టీఎంసీ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ ఎన్నికల అధికారులపై తీవ్ర వ్యాఖ్యలు చేసి, ఫలితాల తర్వాత తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన నందిగ్రామ్, రేజీనగర్ స్థానాలకు వచ్చే అక్టోబర్ 6న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

## ఆంధ్రప్రదేశ్ టెట్ ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి....**

విజయం సాధించిన అభ్యర్థులకు, ముఖ్యంగా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**సులభంగా ఫలితాల చెకింగ్..**

అభ్యర్థులు తమ ఫలితాలను ఏపీ టెట్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. వెబ్‌సైట్‌తో పాటు అభ్యర్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేకంగా వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు 9552300009 అనే వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేయడం ద్వారా కూడా తమ ఫలితాలను నేరుగా పొందవచ్చు.

**నిరుత్సాహం వద్దు.. పట్టుదలతో శ్రమించాలి..**

ఈ పరీక్షలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిన అభ్యర్థులు ఎలాంటి నిరుత్సాహానికి గురికావొద్దని మంత్రి నారా లోకేశ్ సూచించారు. మరింత పట్టుదలతో కృషి చేసి, లోపాలను సరిదిద్దుకుని రాబోయే అవకాశాల్లో విజయం సాధించాలని వారికి ఆయన దిశానిర్దేశం చేశారు.

## నా తప్పునకు మూల్యమే ఈ ట్రాఫిక్

**మొదటిపేజీ తరువాయి....**

వర్లీ నుంచి బయలుదేరిన తనకు విపరీతమైన ట్రాఫిక్ ఎదురైందని, గతంలో తాము చేసిన తప్పులకు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నానని పేర్కొనడంతో సదస్సులో నవ్వులు విరిశాయి. 1995-2000 మధ్య మహారాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు 55 ఫ్లైఓవర్లు, బాంద్రావర్లీ సీ లింక్ నిర్మించినప్పటికీ, అప్పట్లో సరైన సాంకేతికత లేకపోవడమే ఇప్పటి రద్దీకి కారణమని అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న రద్దీని తట్టుకోవడానికి పాత ఫ్లైఓవర్ల స్థానంలో అధునాతన నిర్మాణ సాంకేతికతను వాడాలని గడ్కరీ పిలుపునిచ్చారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సైతం సంప్రదాయ డిజైన్లను పక్కనపెట్టి కొత్త సాంకేతికతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని సలహా ఇచ్చినట్లు గడ్కరీ తెలిపారు. పుణేలో రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టు కోసం మలేషియా సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఒకే పిల్లర్ సెట్‌పై బహుళ స్థాయి ఫ్లైఓవర్లతో పాటు మెట్రో కారిడార్‌ను కూడా నిర్మించవచ్చని వివరించారు. భారత్ వద్ద ఉన్న సామర్థ్యాలను, అమెరికా సాంకేతిక వనరులతో మేళవిస్తే దేశంలో మౌలిక రవాణా రంగాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేయవచ్చని గడ్కరీ స్పష్టం చేశారు.

## వీరుల త్యాగాలను విస్మరించడం సిగ్గుచేటు

**మొదటిపేజీ తరువాయి....**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1948లో సరిగ్గా ఇదే రోజున సర్దార్ వల్లభభాయ్ పటేల్ 'ఆపరేషన్ పోలో'ను ప్రారంభించి, నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించారని గుర్తుచేశారు. దేశం మొత్తం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం జరుపుకుంటే, తెలంగాణ ప్రజలు మాత్రం నిజాం దారుణాలను భరిస్తూ అదనంగా 13 నెలల పాటు ఎదురుచూడాల్సి వచ్చిందని రామచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. వల్లభభాయ్ పటేల్ నిర్ణయాత్మక నాయకత్వం వల్లే హైదరాబాద్ స్వేచ్ఛా వాయువులు పీలుస్తోందని, స్వాతంత్ర్య భారతదేశంలో అంతర్భాగంగా మారిందని కొనియాడారు. తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల ధైర్యసాహసాలను ఎన్నటికీ మరువలేమని, వారి త్యాగాలు తెలంగాణ చరిత్రలో గర్వకారణంగా మిగిలిపోతాయని డాక్టర్ కె. లక్ష్మణ్ ఉద్ఘాటించారు.

## ఆర్యవైశ్యులు రాజకీయాల్లో సత్తా చాటాలి

**మొదటిపేజీ తరువాయి....**

భూమిపూజ తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సమాజంలో ఎంతో సౌమ్యులని, పేదరికం ఉన్నా ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ జీవించే స్వభావం వారిదని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆపదలో ఉన్నవారికి అప్పు ఇచ్చి ఆదుకునే గుణం వారిదని, తాను ఎప్పుడూ ఆర్యవైశ్యుల శ్రేయోభిలాషినేనని స్పష్టం చేశారు. గతంలో చెన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి వంటి ముఖ్యమంత్రులు ఆర్థిక శాఖను ఆర్యవైశ్యులకే అప్పగించారని సీఎం రేవంత్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించే నాటికి రూ. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉండటానికి నాటి ఆర్థిక మంత్రి కె.రోశయ్య దార్శనికతే కారణమన్నారు. మండలిలో ఆవేశంగా మాట్లాడినప్పుడు తనను పిలిచి ఆవేశం తగ్గించుకుంటే భవిష్యత్తు ఉంటుందని రోశయ్య సలహా ఇచ్చారని సీఎం గుర్తుచేసుకున్నారు. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు లాంటి ఆర్యవైశ్య ప్రముఖులు దేశ సమగ్రతకు, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించే ఈ భవనానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి.. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి రాజకీయాల్లో తమ వాటాను దక్కించుకోవాలని పిలుపునిచ్చారు.

## గుర్తింపు లేని 254 మదర్సాల మూసివేత



**కోల్‌కతా (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమ బెంగాల్‌లో తగిన అనుమతులు, గుర్తింపు లేని 254 మదర్సాలను తక్షణమే మూసివేయాల్సిందిగా సువేందు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు మరో 100 మదర్సాలకు షోకాజ్ నోటీసులు పంపినట్లు రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ఖుదీరామ్ టుడు తెలిపారు. సరైన గుర్తింపు పత్రాలు సమర్పించని పక్షంలో వాటిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర సర్వే తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మూసివేసిన వాటిలో ఎక్కువ భాగం ఖరేజీ మదర్సాలేనని, మాల్దా, ఉత్తర దినాజ్‌పూర్, దక్షిణ 24 పరగణాలు, నదియా, ముర్షిదాబాద్ జిల్లాల్లో అత్యధికంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు.

**రాజకీయ దుమారం...**

ప్రస్తుతం రాష్ట్రంలో 2,132 మదర్సాలు ప్రభుత్వ అనుమతులతో నడుస్తుండగా, 2,396 మదర్సాలకు అధికారిక అనుమతులు లేవని మంత్రి వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న తీవ్రవాద ప్రోత్సాహక కార్యకలాపాలను అరికట్టేందుకే ఈ చర్యలని బీజేపీ నాయకులు సమర్థించారు. గుర్తింపు లేని మదర్సాలు అక్రమ కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని ఆరోపించారు. మదర్సాలు కూడా విద్యా వ్యవస్థలో భాగమేనని, వాటిని ఉగ్రవాదంతో ముడిపెట్టడం సరైంది కాదని టీఎంసీ నేత కునాల్ ఘోష్ వ్యాఖ్యానించారు.



## ప్రపంచంలోనే నంబర్-వన్ ఆర్థిక శక్తిగా భారత్

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**

ప్రపంచ దేశాలను వణికిస్తున్న ఆర్థిక సంక్షోభాల నడుమ భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో సమీప భవిష్యత్తులో అమెరికా, చైనా దేశాలను సైతం వెనక్కి నెట్టి భారత్ ప్రపంచంలోనే నంబర్‌వన్ ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త జేఫ్రీ సాక్స్ సంచలన అంచనా వేశారు. రాబోయే 25 ఏళ్ల కాలంలో అమెరికాను అధిగమించి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడమే కాకుండా, అంతిమంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకునే అవకాశాలున్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురుత్వాకర్షణ కేంద్రం నిర్ణయాత్మకంగా ఆసియా వైపు మారుతోందని సాక్స్ విశ్లేషించారు. చైనాతో భారత్‌కు ఉండే లోతైన ఆర్థిక, సాంకేతిక సంబంధాలు మన దేశ వృద్ధి వేగాన్ని మరింత ఇనుమడింపజేస్తాయని తెలిపారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక కేంద్రంగా వెలుగొందిన ఆసియా, భవిష్యత్తులో తిరిగి ఆ వైభవాన్ని సంతరించుకుంటుందని పేర్కొన్నారు. భారత్‌కు చైనా ఎంత అవసరమో, చైనాకు కూడా భారత్ అంతే కీలకమని, ఈ రెండు ఆసియా దిగ్గజాలు కలిసికట్టుగా ప్రపంచ ఆర్థిక శక్తులుగా ఎదుగుతాయని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మూడో స్థానానికి పడిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. చైనా, ఆసియాన్‌తో పాటు ఆఫ్రికా, గల్ఫ్ దేశాలతో భారత్ కొనసాగిస్తున్న భాగస్వామ్యం భవిష్యత్తులో మరింత కీలకం కానుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## భారత్‌పై లాడెన్ కుట్ర.. సీఐఏ వెల్లడి



**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**

అమెరికాపై జరిగిన 9/11 ఉగ్రదాడుల నేపథ్యంలో అల్‌ఖైదా అప్పట్లో భారత్‌ను కూడా లక్ష్యంగా చేసుకోవాలని భావించినట్లు అమెరికా నిఘా సంస్థ సీఐఏ విడుదల చేసిన రహస్య పత్రాల ద్వారా తాజాగా వెలుగులోకి వచ్చింది. 9/11 దాడులకు పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా సీఐఏ నాటి ప్రెసిడెన్షియల్ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్స్‌కు సంబంధించిన సుమారు 100 పేజీలకు పైగా ఉన్న 70 కీలక పత్రాలను బహిర్గతం చేసింది. 1998 ఆగస్టు 28 నాటి బ్రీఫింగ్ ప్రకారం.. అల్‌ఖైదా అగ్రనేత ఒసామా బిన్ లాడెన్ భారత్‌తో పాటు ఈజిప్ట్, పాకిస్తాన్, కువైట్, సౌదీ అరేబియా, యెమెన్, ఉగాండా, నైజీరియా వంటి దేశాలపై కూడా దాడులకు పక్కా ప్రణాళికలు రంచినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. "బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఏ థ్రెట్" పేరిట విడుదలైన ఈ పత్రాలలో లాడెన్ కుట్రలకు సంబంధించిన పలు విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. సరిగ్గా భారత్‌లో ఏ ప్రాంతాన్ని లేదా దేనిని లాడెన్ ప్రధాన లక్ష్యంగా ఎంచుకున్నాడు, ఇందుకు సంబంధించిన ఆపరేషన్ ప్లాన్ ఏంటనే వివరాలు మాత్రం ఆ పత్రాలలో స్పష్టంగా పేర్కొనలేదు. ఉత్తర అమెరికా, ఐరోపా, తూర్పు ఆసియా ప్రాంతాలలో బలమైన ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పరచుకున్న లాడెన్.. ప్రధానంగా అమెరికా ప్రయోజనాలే ధ్యేయంగా దాడులకు వ్యూహరచన చేసినట్లు ఈ పత్రాలు ధృవీకరిస్తున్నాయి. అఫ్గానిస్థాన్‌పై అమెరికా దళాలు క్షిపణి దాడులు చేయడానికి కేవలం కొన్ని గంటల ముందు వరకు కూడా లాడెన్ మరిన్ని భారీ దాడులకు సన్నాహాలు చేస్తూనే ఉన్నాడు. ప్రధానంగా అమెరికా, బ్రిటన్‌లను అతడు తీవ్రంగా టార్గెట్ చేయాలని భావించినట్లు తేలింది. ఈ ఉగ్రకుట్రల ప్రమాదంపై నాటి అమెరికా అధ్యక్షులు బిన్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్‌లను 1998 నుంచి 2001 మధ్య కాలంలో సీఐఏ అధికారులు పలుమార్లు అప్రమత్తం చేసినట్లు ఈ బ్రీఫింగ్స్ ద్వారా స్పష్టమవుతోంది. అంతర్జాతీయ భద్రతను వణికించిన ఈ పత్రాల బహిర్గతం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



## ఏఐ రేసులో ఎవరు గెలిస్తే వారే విజేత

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతపై కఠినమైన నియంత్రణలు విధించాలనే వాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు. ప్రతికూల శక్తులే ఏఐపై లేనిపోని భయాలను పెంచి పోషిస్తున్నాయని, వారి ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయని విమర్శించారు. ఐర్లాండ్ పర్యటనకు వెళ్తున్న సమయంలో మీడియాతో మాట్లాడారు. ఏఐ రంగంలో చైనాపై అమెరికా ఆధిక్యాన్ని సాధించడమే ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు.

**చైనాపై అమెరికాదే పైచేయి**

"ప్రస్తుతం ఏఐ రంగంలో అమెరికా, చైనాను అధిగమిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత అధునాతన దేశంగా ఉన్న మనం ఆ స్థానాన్ని అలాగే నిలబెట్టుకోవాలి. ఏఐ రేసులో ఎవరు గెలిస్తే వారిదే అంతిమ విజయం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఏఐపై తీవ్రమైన ఆంక్షలు, కఠిన నియంత్రణలు తేవడం సరికాదని చెబుతూనే, అవసరమైన స్థాయి రక్షణ చర్యలు మాత్రం తీసుకోవచ్చని తెలిపారు.

# అతి త్వరలో యుద్ధం ముగిస్తా..


**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**



అమెరికాలో త్వరలో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని రాజకీయంగా దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఇరాన్ పశ్చిమాసియాలో ఉద్దేశపూర్వకంగా యుద్ధాన్ని సాగదీస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అమెరికాలో నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ ఉద్రిక్తతలు తగ్గి ఇరాన్-అమెరికా ఘర్షణ అంతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు. ఆ యుద్ధం ముగిసిన తక్షణమే ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ఇరాన్‌పై తాము సాగిస్తున్న సైనిక పోరాటాన్ని ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. 9/11 నాటి అల్‌ఖైదా ఉగ్రవాదంతో మొదలుపెట్టి నేడు ప్రపంచంలో ఉగ్రవాదాన్ని విస్తరిస్తున్న నంబర్ వన్ దేశంగా మారిన ఇరాన్‌తోనూ పోరాటం తప్పడం లేదని స్పష్టం చేశారు. ఇరాన్ చేతికి అణ్వాయుధం చిక్కకుండా తమ సైనికులు వీరోచితంగా శ్రమిస్తున్నారని, ఈ పోరులో తాము విజయం సాధించడం మనుగడకు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై టెహ్రాన్ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఇరాన్‌పై అన్యాయమైన సైనిక చర్యలను సమర్థించుకునేందుకే వాషింగ్టన్ కావాలని 9/11 ఘటనను తెరపైకి తెస్తోందని విమర్శించింది. వాస్తవానికి 9/11 ఉగ్రదాడుల వెనుక ఇరాన్ ప్రమేయం లేదని, నాటి దురాగతాలకు పాల్పడిన అల్‌ఖైదా ఉగ్రవాదులకు అమెరికానే గతంలో ఆయుధాలు, నిధులు సమకూర్చి పెంచి పోషించిందని ఇరాన్ విమర్శనాత్మకంగా బదులిచ్చింది. ఈ పరిణామాలు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలను తీవ్రతరం చేశాయి.

## ఇరాన్ వాణిజ్య నౌకపై క్షిపణి దాడి.. ఒకరు మృతి

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**



హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఇరాన్‌కు చెందిన ఒక వాణిజ్య నౌకపై గుర్తుతెలియని దుండగులు జరిపిన దాడిలో ఒకరు మృతి చెందారు. బందర్ అబ్బాస్ పోర్ట్ సిటీకి సమీపంలోని ఖేష్మ్ ద్వీప ప్రాంతంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి సమయంలో నౌకలో మొత్తం పది మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మృతి చెందిన బాధితుడు ఏ దేశానికి పౌరుడనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే కోణంలో నిపుణులు ఆరా తీస్తుండగా, దీనిపై అమెరికా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ సముద్ర మార్గంలో రాకపోకలను నియంత్రించడంలో ఈ ప్రాంతం అత్యంత వ్యూహాత్మకమైంది కావడం గమనార్హం. హార్మూజ్‌లో నౌకా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు ఒమన్‌తో కలిసి కృషి చేస్తున్నట్లు టెహ్రాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో పొరుగు దేశాల విదేశాంగ మంత్రులతో ఈ నెల 14న అత్యవసర చర్చలు జరపనున్నట్లు ఇరాన్ వెల్లడించింది. ఈ కీలక సమావేశానికి బహ్రెయిన్ ఇప్పటికే హాజరుకాబోమని స్పష్టం చేయగా, ఇతర దేశాల భాగస్వామ్యంపై సందిగ్ధత కొనసాగుతోంది. సరిగ్గా ఈ చర్చలకు కొన్ని గంటల ముందే వాణిజ్య నౌకపై ఈ దాడి జరగడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలు గల్ఫ్ దేశాల మధ్య భద్రతా సమీకరణాలను మరింత సంక్లిష్టంగా మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నాలుగు దేశాలుగా విడిపోనున్న యూకే ?

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**




రవి అస్తమించని సామ్రాజ్యంగా' ప్రపంచాన్ని శాసించిన యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ఇప్పుడు అంతర్గత వేర్పాటు ఉద్యమాలు, రాజకీయ పరిణామాల కారణంగా నాలుగు ముక్కలయ్యే చారిత్రక ముప్పును ఎదుర్కొంటోంది. బ్రిటన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాలుగా అవతరించేందుకు స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ప్రాంతాలుగా సన్నద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వేల్స్ లోని కార్డిఫ్ వేదికగా జరగనున్న ఆయా ప్రాంతాల ఫస్ట్ మినిస్టర్ల అత్యున్నత స్థాయి సమావేశం లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ ప్రభుత్వానికి పెను సవాల్‌గా పరిణమించింది. స్వయం నిర్ణయాధికారమే లక్ష్యంగా ఈ భేటీలో నేతలు నిర్ణయాలు తీసుకోనున్నారు.

**స్వయం నిర్ణయాధికారంపై సంయుక్త ప్రకటన...**

కార్డిఫ్ బే సమీపంలోని ఒక హోటల్‌లో జరగనున్న ఈ చారిత్రక సమావేశంలో స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్ రూన్ అప్ ఇయోర్‌వర్త్, ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన సిన్ ఫెయిన్ పార్టీ అధ్యక్షురాలు మేరీ లూ మెక్‌డొనాల్డ్‌తో పాటు పలువురు అగ్రనేతలు పాల్గొననున్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించే హక్కును నొక్కిచెబుతూ వీరంతా ఒక సంయుక్త డిక్లరేషన్‌పై సంతకాలు చేయనున్నారు. భవిష్యత్తులో నూతన రాజకీయ ప్రచారానికి శ్రీకారం చుట్టడంతో పాటు ఆర్థిక వ్యవస్థ, ఇంధన వనరులు, యూరప్, అంతర్జాతీయ వ్యవహారాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు.

**మారుతున్న రాజకీయ సమీకరణాలు..**

2014లో స్కాట్లాండ్‌లో స్వాతంత్ర్యంపై తొలిసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిగినా, అప్పట్లో మెజార్టీ ప్రజలు యూకేలోనే కొనసాగడానికి మొగ్గు చూపారు. అయితే 2016లో యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి యూకే బయటకు రావడాన్ని స్కాట్లాండ్ ప్రజలు వ్యతిరేకించారు. తమ ప్రమేయం లేకుండానే ఈయూ నుంచి బయటపడాల్సి వచ్చిందనే అసంతృప్తి అక్కడి ప్రజల్లో బలంగా ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఐర్లాండ్ పునరేకీకరణకు మద్దతుగా చేసిన వ్యాఖ్యలు ఈ ప్రాంతంలో సరికొత్త చర్చకు దారితీశాయి. ప్రస్తుతం స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌లలో స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించే రాజకీయ పార్టీలు అపూర్వమైన ప్రజా మద్దతుతో అధికారంలోకి రావడం యూకే రాజ్యాంగ వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతోంది.

**ఇంగ్లాండ్, యూకే, బ్రిటన్‌ల మధ్య తేడాలేమిటి..?**

భౌగోళికంగా ఇంగ్లాండ్, స్కాట్లాండ్, వేల్స్ కలగలిపిన ద్వీపాన్ని 'గ్రేట్ బ్రిటన్' అంటారు. ఈ ప్రాంతానికి ఉత్తర ఐర్లాండ్ కూడా తోడైతే దానిని 'యునైటెడ్ కింగ్‌డమ్' (యూకే) అంటారు. 1999 నుంచి బ్రిటన్ ప్రభుత్వం ఈ ప్రాంతాలకు విద్య, ఆరోగ్యం, రవాణా వంటి అంశాల్లో స్వయంప్రతిపత్తి కల్పించింది. అయితే రక్షణ, విదేశాంగ విధానం, కరెన్సీ వంటి కీలక శాఖలు మాత్రం వెస్ట్ మినిస్టర్ పార్లమెంట్ చేతిలోనే ఉన్నాయి. ఒలింపిక్స్ లో బ్రిటన్‌గా కలిసి ఆడినప్పటికీ, అంతర్గతంగా ఈ నాలుగు ప్రాంతాలకు విడివిడిగా ప్రత్యేక గుర్తింపులు ఉన్నాయి.

**విడిపోతే ఇంగ్లాండ్ పరిస్థితి ఏమిటి ?...**

ఒకవేళ ఈ నాలుగు దేశాలుగా విడిపోతే బ్రిటన్ అంతర్జాతీయంగా తన ప్రాభవాన్ని భారీగా కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న బ్రిటన్ స్థానం.. ఈ విభజన తర్వాత ఏడో స్థానానికి పడిపోయే ప్రమాదముంది. యూకే మొత్తం వైశాల్యంలో ఇంగ్లాండ్ దాదాపు 46 శాతాన్ని కోల్పోతుంది. ఉత్తర సముద్రంలోని అత్యంత విలువైన చమురు, సహజ వాయువు నిల్వలు, భారీ పవన విద్యుత్ కేంద్రాలన్నీ స్కాట్లాండ్ సరిహద్దులకే పరిమితం కానున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో యూకేకు ఉన్న శాశ్వత సభ్యత్వం, వీటో అధికారాల భవితవ్యంపై కూడా ఇప్పటికే అంతర్జాతీయంగా చర్చ నడుస్తోంది.

## జావా సముద్రంలో ఘోరం...ఒకరు మృతి, 140 మంది గల్లంతు

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**



ఇండోనేసియాలోని జావా సముద్రంలో సంభవించిన ఘోర నౌకా ప్రమాదం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ప్రతికూల వాతావరణం, భారీ అల్లకల్లోల అలల కారణంగా సుమారు 243 మంది ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తున్న 'వర్గో ట్రాన్స్ పోర్ట్ 8' అనే వాణిజ్య నౌక జావా సముద్రంలో బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో ఒకరు మరణించగా, సుమారు 140 మంది గల్లంతయ్యారు. తూర్పు జావా నుంచి దక్షిణ కాలిమంతన్ ప్రావిన్స్‌కు ప్రయాణిస్తున్న ఈ నౌక ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదానికి గురైనట్లు బంజార్‌మసన్‌లోని సెర్చ్ అండ్ రెస్క్యూ కార్యాలయం వెల్లడించింది. ప్రమాదానికి ముందు సుమారు 10 అడుగుల ఎత్తున ఎగిసిపడుతున్న భారీ అలల తాకిడికి నౌక ఒకవైపునకు వంగిపోయిందని, ఈ మేరకు షిప్ కెప్టెన్ హెచ్చరిక సందేశం జారీ చేసిన కొద్ది సేపటికే నౌకతో కమ్యూనికేషన్లు పూర్తిగా తెగిపోయినట్లు అధికారులు తెలిపారు.

**ఉప్పెనలా ఎగిసిపడిన అలలు..**

ప్రమాదానికి గురైన జపాన్ తయారీ 'వర్గో ట్రాన్స్ పోర్ట్ 8' నౌకను సాధారణంగా ప్రయాణికులతో పాటు వాహనాల రవాణా కోసం కూడా ఉపయోగిస్తారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10.13 గంటలకు సురబయ నుంచి బయలుదేరిన ఈ నౌక.. చివరిసారిగా బంజర్‌మాసిన్‌లోని ఒక రేవు నుంచి సుమారు 148 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో ఉన్నట్లు నిర్ధారించారు. నౌకలో మొత్తం 243 మంది ఉండగా, అందులో 213 మంది ప్రయాణికులు, 30 మంది నౌక సిబ్బంది ఉన్నారు. నౌక బోల్తాపడిన రెండు గంటల తర్వాత సమాచారం అందుకున్న ఇండోనేసియా సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. ప్రమాదస్థలి సమీపంలో ఉన్న టగ్‌బోట్లు, ఇతర రెస్క్యూ నౌకల సహకారంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి ఇప్పటివరకు 102 మందిని సురక్షితంగా రక్షించాయి. సముద్రంలో నుంచి ఒక ప్రయాణికుడి మృతదేహాన్ని వెలికితీశారు. గల్లయిన మరో 140 మంది ఆచూకీ కోసం సహాయక బృందాలు హెలికాప్టర్లు, ప్రత్యేక నౌకలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## పసిడి కోసం 18 రోజుల పాటు సముద్ర అన్వేషణ

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**



పసిఫిక్ మహాసముద్ర గర్భంలో చైనా శాస్త్రవేత్తల వ్యూహాత్మక సముద్ర అన్వేషణ అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. పశ్చిమ పసిఫిక్ సముద్రపు అడుగుభాగంలో అత్యంత నాణ్యమైన, అపారమైన బంగారం, వెండి ఖనిజ నిక్షేపాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. గత నెలలో కేవలం 18 రోజుల పాటు సాగిన ఈ సముద్ర అన్వేషణలో, చైనా పూర్తిగా తమ స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన అత్యాధునిక పరికరాలను ఉపయోగించి ఈ అద్భుతమైన ఖనిజ క్షేత్రాన్ని వెలికితీసింది. సాధారణంగా భూమిపై లభించే ముడి గనులతో పోలిస్తే, సముద్ర గర్భంలో బయటపడిన ఈ నిక్షేపాలలో బంగారం, వెండి సాంద్రత చాలా అసాధారణ రీతిలో ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక ఆవిష్కరణ ప్రపంచ మైనింగ్ రంగానికి సరికొత్త దిశను నిర్దేశించనుంది.

**స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో...**

పశ్చిమ పసిఫిక్ మహాసముద్ర పరివాహక ప్రాంతంలో చైనాలోని ప్రఖ్యాత త్సింగ్‌హువా విశ్వవిద్యాలయానికి చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ ఇంజనీరింగ్' శాస్త్రవేత్తల బృందం ఈ సుదీర్ఘ పరిశోధనను విజయవంతంగా నిర్వహించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన చేసిన 'అటానమస్ అండర్‌వాటర్ వెహికల్', 'డీప్‌సీ విజ్యువల్ శాంప్లర్' వంటి అత్యాధునిక పరికరాలను సాయంతో సముద్రపు అడుగుభాగంలో అన్వేషణ సాగించారు. గత ప్రాథమిక సర్వేల ఆధారంగా సముద్రంలో సుమారు 700 నుంచి 1,500 మీటర్ల లోతులో హైడ్రోథర్మల్ వెంట్స్‌ను (ఉష్ణ జల రంధ్రాలు) గుర్తించారు. ఈ ప్రాంతంలో నీటి ఉష్ణోగ్రత 315 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదైందని, అక్కడ అత్యంత చురుకైన రసాయనిక, ఉష్ణ ప్రక్రియలు కొనసాగుతున్నట్లు పరిశోధకులు నిర్ధారించారు.

**రికార్డు స్థాయిలో బంగారం, వెండి...**

ఈ ఉష్ణ జల రంధ్రాల పరిసర ప్రాంతాల్లో మూడు భారీ శంఖాకార ఖనిజ నిర్మాణాలు ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. నౌకలోని ప్రయోగశాలలో జరిపిన ప్రాథమిక పరీక్షల్లో ఈ నిక్షేపాల్లో చాల్కోపైరైట్, పైరైట్, స్ఫాలరైట్ వంటి అత్యంత విలువైన ఆర్థిక ప్రాధాన్యం కలిగిన ఖనిజాలు ఉన్నట్లు తేలింది. పార్ట్స్ పర్ మిలియన్ స్థాయిలో పరిశీలిస్తే బంగారం గరిష్ఠంగా 15.4 పీపీఎమ్‌గా నమోదైంది. అంటే ప్రతి టన్ను ముడి ఖనిజానికి దాదాపు 15.4 గ్రాముల బంగారం లభిస్తుంది. ఇక వెండి విషయానికొస్తే రికార్డు స్థాయిలో 1,271 పీపీఎమ్ నమోదైంది. అంటే ప్రతి టన్ను ముడి ఖనిజంలో ఏకంగా 1,271 గ్రాముల వెండి ఉన్నట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. భూమిపై లభించే సాధారణ ఖనిజాలతో పోలిస్తే ఈ సాంద్రత చాలా ఎక్కువ కావడం విశేషం.

**కడలిలో అరుదైన జీవరాశులు ...**

ఈ అన్వేషణలో భాగంగా అత్యంత కఠినమైన సముద్ర గర్భ వాతావరణంలో అనేక అరుదైన జీవరాశులు, జన్యు వనరులు ఉన్నట్లు గుర్తించారు. పరిశోధన బృందం ఈ హైడ్రోథర్మల్ క్షేత్రంలో రొయ్యలు, పీతలు, షెల్ఫిష్, ఎక్స్‌ట్రీమోఫైల్స్ తో కూడిన విభిన్న జీవ సమూహాలను గుర్తించి ఫొటోలు తీసింది. అత్యంత విపరీతమైన ఉష్ణోగ్రతలు, పీడనం ఉండే వాతావరణంలో ఈ ప్రాణులు ఎలా జీవిస్తున్నాయనే అంశంపై భవిష్యత్తులో జరిగే శాస్త్రీయ పరిశోధనలకు ఈ ఆవిష్కరణ ఒక మైలురాయిగా నిలవనుంది. భూమిపై సహజ వనరులు క్రమంగా తరిగిపోతున్న తరుణంలో, పసిఫిక్ సముద్రంలో లభించిన ఈ రికార్డు స్థాయి బంగారం, వెండి సంపదను వాణిజ్యపరంగా వెలికితీసే దిశగా చైనా తన తదుపరి అడుగులు వేయనుంది.



## పుతిన్ - జెలెన్‌స్కీ భేటీపై ఉత్కంఠ

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**

రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించేందుకు అమెరికా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు సాగుతున్న వేళ, రెండు దేశాల అధినేతల భేటీపై ఉత్కంఠ కొనసాగుతోంది. అమెరికాలోని మియామి వేదికగా డిసెంబరులో జరగనున్న జీ-20 సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ నేరుగా చర్చలు జరపనున్నారంటూ అంతర్జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఖండించారు. పుతిన్, జెలెన్‌స్కీల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగడం పూర్తిగా అసాధ్యమని, ఆ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు నిజంగానే పుతిన్‌ను కలవాలని భావిస్తే నేరుగా మాస్కోకు రావాల్సిందేనని ఆయన షరతు పెట్టారు. రష్యా గడ్డపై కాకుండా మూడో ప్రదేశంలో ఈ సమావేశం జరిగే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

**ఆహ్వానిస్తే మాస్కో వస్తా.. జెలెన్‌స్కీ**

అమెరికా గనుక తమను, ఒకే వేదికపైకి ఆహ్వానిస్తే రష్యా అధినేతతో నేరుగా చర్చలు జరిపేందుకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నట్లు శనివారం జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధ ముగింపు విషయంలో మాస్కో వైఖరి ఏంటనేదే ఇక్కడ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత యుద్ధరంగంలో ఉక్రెయిన్ సేనలు మరింత బలంగా తయారయ్యాయని, రష్యా దళాలను దీటుగా ఎదుర్కొంటున్నామని జెలెన్‌స్కీ ధీమా వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య నెలకొన్న ఈ భిన్న ప్రకటనలు పశ్చిమాసియా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అయితే , జీ-20 శిఖరాగ్ర సదస్సుకు పుతిన్ హాజరవుతారనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత రాలేదు.



## సైనిక కాన్వాయ్‌పై దాడి.. 23 మంది మృతి

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**

పాకిస్తాన్‌లో భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు మరోసారి అత్యంత కిరాతక చర్యకు పాల్పడ్డారు. బలూచిస్తాన్ ప్రావిన్స్ లోని లాస్‌బెలా జిల్లాలో సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన శక్తివంతమైన పేలుడు దాడిలో 23 మందికి పైగా పాకిస్తానీ సైనికులు దుర్మరణం చెందారు. శనివారం మధ్యాహ్నం సంభవించిన దుర్ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. కరాచీ, క్వెట్టా నగరాలను అనుసంధానించే వ్యూహాత్మకమైన ఎన్‌హెచ్ 25 జాతీయ రహదారిపై ఈ దారుణం చోటుచేసుకుంది. లాస్‌బెలా జిల్లాలోని కషారీ ప్రాంతం గుండా పాకిస్తాన్ ఫ్రాంటియర్ ఫోర్స్‌కు చెందిన సుమారు 15 వాహనాల కాన్వాయ్ వెళ్తుండగా ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. సైనిక వాహనాలే ప్రధాన లక్ష్యంగా ముందుగా అమర్చిన శక్తివంతమైన పేలుడు పదార్థాలను రిమోట్ ద్వారా పేల్చడంతో, ఒక భద్రతా వాహనం పూర్తిగా ధ్వంసమై మంటల్లో చిక్కుకుంది. ఈ పేలుడు తీవ్రతకు పలువురు సైనికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. ఈ మారణహోమం వెనుక స్థానిక వేర్పాటువాద సంస్థ 'బలూచ్ లిబరేషన్ ఆర్మీ' హస్తం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. బలూచిస్తాన్ ప్రాంతంలో పాకిస్తానీ సైన్యం సాగిస్తున్న దౌర్జన్యాలు, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా కొద్దికాలంగా భద్రతా దళాలు, చెక్‌పోస్టులు, సైనిక కాన్వాయ్‌లపై బీఎల్ఏ తమ దాడులను తీవ్రతరం చేసిన విషయం తెలిసిందే. దాడి సమాచారం అందుకున్న వెంటనే అదనపు బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం సమీపంలోని బేలా ఆర్మీ క్యాంపునకు తరలించారు. ఈ ఉగ్రదాడి నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఎన్‌హెచ్ 25 జాతీయ రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. పరారైన ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రతా బలగాలు చుట్టుపక్కల కొండ ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల సంఖ్యపై పాకిస్తాన్ సైనిక ప్రధాన కార్యాలయం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ప్రపంచ వేదికపై ప్రతి దేశం సమానమే



**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)**

ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి ఏవిధంగా గందరగోళానికి దారితీస్తుందో, అంతర్జాతీయ నిబంధనలు లేని ప్రపంచం కూడా అలాగే అస్తవ్యస్తంగా మారుతుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హెచ్చరించారు. ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ఆదివారం ప్రసంగం చేశారు. గ్లోబల్ సౌత్ దేశాలతో ఉన్న సత్సంబంధాలను సద్వినియోగం చేసుకొని, సరఫరా గొలుసులను పరిరక్షించడంతో పాటు సమీకృత విపణిని ప్రోత్సహించాలని బ్రిక్స్ సభ్య దేశాలకు పిలుపునిచ్చారు. వాణిజ్యం, తయారీ రంగం, పెట్టుబడులు, సాంకేతికతలో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ఐదు సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించారు.అంతర్జాతీయ వేదికలపై బలవంతుడిదే రాజ్యమనే వలసవాద భావనను దేశాలు విడనాడాలని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. పరిమాణం, ఆర్థిక శక్తిసామర్థ్యాలతో సంబంధం లేకుండా ప్రపంచ వేదికపై ప్రతి దేశం సమానమేనని, అంతర్జాతీయ నిబంధనల రూపకల్పనలో అందరికీ భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల ఐక్యత కోసం కొత్త అధ్యాయాన్ని లిఖించాలని సూచించారు. ప్రపంచ వ్యవహారాల్లో ఐక్యరాజ్యసమితి సర్వోన్నతాధికారాన్ని కాపాడాలని, అన్ని దేశాలకు సమాన హక్కులు దక్కేలా అంతర్జాతీయ చట్టాలు అమలు కావాలని ఆకాంక్షించారు.

మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
14.09.2026
www.manasarkar.com



## కేరళ పర్యటనపై భావోద్వేగ పోస్ట్ చేసిన పవన్

**అమరావతి(ఏడీఎన్ఎన్):**

ముంబైలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. దానికి కొనసాగింపుగా ఆయుర్వేద చికిత్స కోసం కేరళ వెళ్లిన విషయం తెలిసిందే. అక్కడ దాదాపు 21 రోజులపాటు చికిత్స పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న వేళ ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యం, అక్కడి చారిత్రక దేవాలయాల దర్శనాల అనుభూతిని పంచుకుంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.తనకు కేవలం చికిత్స కాలం మాత్రమే కాకుండా ఇది స్వస్థత, ప్రశాంతత, మధుర జ్ఞాపకాలను అందించిన సమయమని పవన్ అభివర్ణించారు. డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రిట్రీట్ వైద్య బృందంతో పాటు, కేరళ ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి, రాష్ట్ర ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా ఆయన త్రిప్రయార్ శ్రీరామస్వామి, గురువాయూర్ శ్రీకృష్ణ, మమ్మియూర్ శ్రీ మహాదేవ్, చెట్టికుళంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను దర్శించుకున్నారు. శతాబ్దాల చరిత్ర, సంప్రదాయాలు ఉట్టిపడే ఈ ఆలయాల సందర్శన తనకు ఎంతో ప్రశాంతతను, భక్తి భావాన్ని కలిగించిందని.. కేరళ ఆలయాలు మన ప్రాచీన నాగరికతకు సజీవ ప్రతిరూపాలని పేర్కొన్నారు. తన పర్యటన సజావుగా సాగేందుకు సహకరించిన కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్, డీజీపీ, పోలీసు బృందాలు, వివిధ జిల్లాల యంత్రాంగాలు , స్టేట్ ప్రోటోకాల్ విభాగానికి ధన్యవాదాలు తెలుపుతూ 'థ్యాంక్యూ కేరళ..' అంటూ పోస్ట్ ముగించారు.

**పవన్ కళ్యాణ్ పోస్ట్‌పై స్పందించిన కేరళ సీఎం వీడీ సతీశన్:**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన భావోద్వేగ పోస్ట్‌కు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. విశ్రాంతి తీసుకోవడానికి, చికిత్స కోసం తమ రాష్ట్రానికి విచ్చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కేరళ ప్రజల ఆప్యాయత, చారిత్రక ఆలయాల దర్శనాలు ఆయనకు మనశ్శాంతిని, సంపూర్ణ ఆరోగ్యాన్ని చేకూర్చాయని తెలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.'త్వరలో మిమ్మల్ని మరోసారి కేరళకు ఆహ్వానించడానికి, ఆతిథ్యం ఇవ్వడానికి మేము ఎదురుచూస్తున్నాం. పవన్ కళ్యాణ్ పూర్తిగా కోలుకుని ఉత్తమమైన ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాం' అని సీఎం వీడీ సతీశన్ తన సందేశంలో పేర్కొన్నారు.



## గోవా గవర్నర్‌తో చిన్న శ్రీను భేటీ

**విజయనగరం(ఏడీఎన్ఎన్):**

వైసీపీని వీడి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన బొత్స సత్యనారాయణ మేనల్లుడు, ప్రముఖ నేత మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. గోవాలోని గవర్నర్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి చిన్న శ్రీను తన కుమార్తె సిరి సహస్రతో కలిసి హాజరయ్యారు. ఈ భేటీలో గవర్నర్ అశోక్ గజపతిరాజు.. చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు అభినందనలు తెలిపి శుభాకాంక్షలు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా పాల్గొని చిన్న శ్రీను కుటుంబానికి ఆతిథ్యం ఇచ్చారు. సమావేశం తర్వాత చిన్న శ్రీను మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాలను, అలాగే అశోక్ గజపతిరాజు వంటి సీనియర్ నేతల మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తానని స్పష్టం చేశారు. కేవలం వారి పెద్దల ఆశీస్సులు, సూచనలు కోసమే ఈ ప్రత్యేక భేటీ జరిగినట్లు ఆయన వెల్లడించారు.కాగా, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబానికి చెందిన చిన్న శ్రీను.. ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి, తన కుమార్తె సిరి సహస్రతో కలిసి ఉండవల్లిలో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. చంద్రబాబు వారికి పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలక పరిణామాల మధ్య.. విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ అగ్రనేత అశోక్ గజపతిరాజుతో చిన్న శ్రీను భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

## తిరుమలకు చేరిన రిలయన్స్ ఎలక్ట్రిక్ బస్సులు..



**తిరుమల (ఏడీఎన్ఎన్):**

తిరుమల శ్రీవారి భక్తులకు మెరుగైన రవాణా సదుపాయలందించే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడి) మరో ముందడుగు వేసింది. తితిదేకు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ విరాళంగా ప్రకటించిన ఎలక్ట్రిక్ బస్సుల్లో తొలి విడతగా 15 బస్సులు ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నాయి. గత ఏడాది జూన్‌లో శ్రీవారిని దర్శించుకున్న అనంత్ అంబానీ.. టీటీడీ కు రూ.27.5 కోట్ల విలువైన మొత్తం 25 ఎలక్ట్రిక్ 'ధర్మరథం' బస్సులతో పాటు, వాటి నిర్వహణకు అవసరమైన 50 మంది డ్రైవర్లను, ఛార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ సంస్థ తరఫున విరాళంగా అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ సామాన్య భక్తుల సౌకర్యార్థం ఈ ఎలక్ట్రిక్ బస్సులను వినియోగంలోకి తెస్తున్నారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బస్సులను ప్రారంభించనున్నట్లు టీటీడి అధికారులు వెల్లడించారు.రిలయన్స్ సంస్థ అందజేస్తున్న ఈ బస్సులతో పాటు, భారత్ బయోటెక్ సంస్థ మరో ఏడు ఎలక్ట్రిక్ బస్సులను కూడా విరాళంగా ఇవ్వనుంది. ఈ బస్సులన్నీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. తిరుమలలో ప్రైవేట్ వాహనాల బెడద తగ్గి, సామాన్య భక్తులకు కాలుష్య రహిత, ప్రశాంతమైన ప్రయాణ సౌకర్యం కలగనుంది.

# చంద్రబాబు వాటర్ మెన్ కాదు.. క్వార్టర్ మెన్

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్):**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలకు కనీసం మంచి నీరు కూడా అందడం లేదని, నగరంలో తాగునీటి సమస్య తీవ్రమైందని మండిపడ్డారు. విశాఖ నగర వైసీపీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, కేకే రాజు, వరుదు కళ్యాణి, మాజీ మేయర్ హరి వెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ వైఫల్యాలపై కూలంకషంగా చర్చించారు.

**చంద్రబాబు నైజం 'యూజ్ అండ్ త్రో' పాలసీ: కురసాల కన్నబాబు**

ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ''చంద్రబాబు వాటర్ మెన్ కాదు.. క్వార్టర్ మెన్. ప్రజలకు మంచి నీరు ఇవ్వలేదు.. మందు మాత్రం ఇస్తున్నారు,'' అని ఎద్దేవా చేశారు. విశాఖలో మూడు రోజులకు ఒకసారి కూడా మంచి నీరు ఇవ్వడం లేదని, వేలాది బోర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి నీళ్లు ఇవ్వలేని ప్రభుత్వం ఉంటే ఎంత, పోతే ఎంత అని ప్రశ్నించారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, ఇక ఎండాకాలంలో తాగునీటి పరిస్థితి ఏంటని నిలదీశారు. మంచి నీటి సమస్యను పరిష్కరించడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుది వెన్నుపోటు పార్టీ అయితే, వైసీపీ వెన్ను చూపని పార్టీ అని పేర్కొన్నారు. చంద్రబాబు నైజం ఎప్పుడూ 'యూజ్ అండ్ త్రో పాలసీ'నే అని దుయ్యబట్టారు. గతంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన సాధారణ మహిళను జీవీఎంసీ మేయర్‌గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ మేయర్ పీఠం నుంచి ఆమెను దించేయడమే కాకుండా, యాదవులను అవమానించారని మండిపడ్డారు.రుషికొండపై భవనం కడితే తప్పుడు ప్రచారం చేశారని, కానీ కూటమి పాలనలో విశాఖ నగరంలో కొండలను పిండి చేస్తున్నారని ఆరోపించారు. రూపాయికి చాక్లెట్ కూడా రాదని, అలాంటిది ఎకరా భూమిని కేవలం 99 పైసలకు కట్టబెట్టేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు చేసిన మోసాన్ని కార్యకర్తలు గడపగడపకూ తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పింఛన్లు తీసుకునే వారిని తాగుబోతులుగా చిత్రీకరిస్తున్నారని, పెన్షన్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

**అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారు: వరుదు కల్యాణి**


వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం కోసం రూ.2 లక్షల 40 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. మూడేళ్లలో కేవలం రూ.32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వైసీపీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేసి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: కేకే రాజు**

విశాఖ నగర వైసీపీ అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలను అమలు చేశారని, విశాఖకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. జీవీఎంసీలో బడుగు, బలహీన వర్గాలకు, ముఖ్యంగా యాదవులకు కీలక పదవులు ఇచ్చి గౌరవించింది వైసీపీయేనని ఆయన స్పష్టం చేశారు.

# కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**అనంతపురం(ఏడీఎన్ఎన్):**



రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. అనంతపురం మార్కెట్ యార్డును ఆదివారం ఆయన సందర్శించి, అక్కడ నిర్వహించిన పశువుల సంతలో రైతులను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా పశుగ్రాసం తీవ్ర కొరత ఏర్పడిందని, దీంతో చేసేది లేక రైతులు తమ మూగజీవాలను అమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న కరువు పరిస్థితులను ప్రభుత్వం ఇప్పటికైనా గమనించాలని, తక్షణమే కరువును 'జాతీయ విపత్తు'గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ తీవ్ర సమస్యలను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు స్వయంగా సీఎంను కలవనున్నట్లు రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంక్షోభంలో ఉన్న రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మన్యంలో ఏనుగుల సంరక్షణ కేంద్రం పరిశీలన

**పార్వతీపురం మన్యం (ఏడీఎన్ఎన్):**



ఆంధ్రప్రదేశ్ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాగబాబు.. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆదివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సీతానగరం మండలంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఆయన సంరక్షణ కేంద్రం పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం అక్కడ ఉన్న కుంకీ ఏనుగులకు స్వయంగా ఆహారం అందజేశారు. ఏనుగుల సంరక్షణ తీరుతెన్నులు, వాటి పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు తాము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. అడవులు , వన్యప్రాణుల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. భవిష్యత్తు తరాల కోసం రాష్ట్రంలో 2047 నాటికి పచ్చదనాన్ని గణనీయంగా పెంచేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్తున్నామని ఆయన వెల్లడించారు.

# రాయలసీమలో ఎండిపోతున్న వేరుశనగ పంట

**అమరావతి(ఏడీఎన్ఎన్):**



వర్షాభావ పరిస్థితుల కారణంగా రాయలసీమ వ్యాప్తంగా వేరుశనగ పంట తీవ్రంగా ఎండిపోతోందని, ఇది కేవలం రైతు సమస్య మాత్రమే కాదని, మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థే తీవ్ర సంక్షోభంలో పడిందని వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్ర వ్యవసాయ మిషన్ మాజీ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం దంచర్ల గ్రామంలో పంట ఎదుగుదల దశలోనే మొక్కలు వాడిపోతున్న తీరు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. 2022-23లో రాయలసీమలో 4.13 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు జరగగా.. ఈ ఏడాది సాధారణ సాగు అంచనాతో పోలిస్తే విస్తీర్ణం భారీగా తగ్గిందని తెలిపారు. సెప్టెంబర్ 9 నాటికి కేవలం 1.47 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు జరిగిందని, ఇది తీవ్ర సంక్షోభానికి సంకేతమని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలు: మండలాల వారీగా ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, ఎండిపోతున్న పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కరువు ఆర్థిక సహాయ ప్యాకేజీని ప్రకటించాలి. అర్హులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం అందజేయాలి. నష్టపోయిన రైతుల బ్యాంకు రుణాలను రీస్ట్రక్చరింగ్ చేయడంతో పాటు తదుపరి పంటకు పెట్టుబడి సాయం అందించాలి. పశువులకు మేత, తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. వేరుశనగ రైతును ఆదుకోవడం అంటే కేవలం అనంతపురం రైతును ఆదుకోవడం మాత్రమే కాదని, మొత్తం రాయలసీమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడటమేనని ఎంవీఎస్ నాగిరెడ్డి స్పష్టం చేశారు.

# అంటువ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు


**అమరావతి(ఏడీఎన్ఎన్):**



రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వం తరఫున రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా అధికారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కేసులు అధికంగా నమోదయ్యే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో మందు పిచికారీ చేయడంతో పాటు దోమతెరల పంపిణీని ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందిని భాగస్వామ్యం చేసి దీన్ని కిందిస్థాయి వరకు అమలు చేయాలన్నారు. ఎక్కడైనా కేసులు పెరిగితే వెంటనే ఆయా స్థాయి అధికారులకు అలర్ట్‌లు వెళ్లేలా పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత నెల 30 నాటికి రాష్ట్రంలో 7,895 మలేరియా కేసులు నమోదయ్యాయని, నిరుటితో పోలిస్తే రాష్ట్రంలో మలేరియా కేసులు 27.9 శాతం మేర పెరిగాయని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా అల్లూరి, పోలవరం, విజయనగరం ప్రాంతాల్లో మలేరియాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అల్లూరి, పోలవరం, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల్లో రెండో విడత మందు పిచికారీ చేయాలని సూచించారు. అర్హులైన పేదలకు 5.99 లక్షల దోమతెరల పంపిణీని ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,475 డెంగీ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు. కడపలో 48 నుంచి 128కి, చిత్తూరులో 73 నుంచి 112కి డెంగీ కేసులు పెరిగినట్లు వివరించారు. అయితే కర్నూలు, అనకాపల్లి జిల్లాల్లో మాత్రం కేసులు తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. డెంగీ కేసులు వెలుగుచూసిన ప్రాంతాల్లో వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 941 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని, అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ కేసులు పెరిగినట్లు తెలిపారు. మరోవైపు శ్రీకాకుళంలో ఆహారం ద్వారా వచ్చే వ్యాధుల కేసులు 34 నుంచి ఏకంగా 408కి పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో తాగునీరు, ఆహార పరిశుభ్రతపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహారం ద్వారా వచ్చే వ్యాధుల కేసులు మొత్తం 930గా నమోదయ్యాయని పేర్కొన్నారు. కర్నూలులో టైఫాయిడ్ కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పరిశీలించి సురక్షిత నీటిని అందించాలని అధికారులను ఆదేశించారు.

# నేతన్నలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం

**నంద్యాల(ఏడీఎన్ఎన్):**



చేనేత కార్మికుల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. 'నేతన్న నేస్తం' పథకం కింద అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి సంవత్సరానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 51,952 మంది నేతన్నలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుతుందని తెలిపారు. నంద్యాలలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల వివరాలను వెల్లడించారు.ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన హామీల్లో భాగంగా రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేత కార్మికులకు 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ కింద ప్రతినెలా రూ.4,000 అందజేయనున్నట్లు తెలిపారు. చేనేత రంగానికి ఊతమిచ్చేలా 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా చేనేత మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గానికి 500 యూనిట్ల చొప్పున ఉచిత కరెంటును అందిస్తామని స్పష్టం చేశారు.శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ వేడుకల్లో రాష్ట్ర మరో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కూడా ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, స్థానిక ప్రజలు, చేనేత కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## స్టాఫ్ సెలక్షన్ కమిషన్ లో 4,284 ఉద్యోగాలు

**న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్):**

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వరుసగా నోటిఫికేషన్లను జారీ చేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా వివిధ విభాగాల పరిధిలో మొత్తం 4,284 ఉద్యోగాల భర్తీకి ఎస్ఎస్సీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత , ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 1,748 జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. ఈ పోస్టులకు అప్లై చేసుకోవడానికి ఈ నెల 22 వరకు గడువు ఉంది. సంబంధిత టెక్నికల్ విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, లేదా బీఈ,బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.ఇంజినీరింగ్ పోస్టులతో పాటు ఇతర విభాగాల్లో మరో 2,536 ఉద్యోగాల భర్తీకి కూడా ఎస్ఎస్సీ అవకాశం కల్పించింది. ఈ పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుండగా, అక్టోబర్ 7 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. కనీసం ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.ఈ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాలు, విద్యార్హతలు, వయసు సడలింపులు, సిలబస్ అలాగే ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కోసం అభ్యర్థులు ఎస్ఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https://ssc.gov.in/ ను సంప్రదించాలని సూచించారు.

## విలాసాల కోసం బీటెక్ యువకుడు భారీ చోరీ

**విజయవాడ(ఏడీఎన్ఎన్):**



చదువుకుని ప్రయోజకుడు కావాల్సిన ఒక బీటెక్ యువకుడు.. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి దొంగతనం బాట పట్టాడు. చేసిన విపరీతమైన అప్పులకు ఈఎంఐలు కట్టలేక ఏకంగా సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఇంట్లోనే భారీ చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్ మీడియాకు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ నగరానికి చెందిన 22 ఏళ్ల మరీదు వినోద్ కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. అయితే లావిష్ లైఫ్‌స్టైల్ గడపడం కోసం విపరీతంగా అప్పులు చేశాడు. ఆ అప్పులకు ఈఎంఐలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో పడిన వినోద్.. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో దొంగతనాలకు ప్లాన్ చేశాడు.ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీన నగరంలోని వెటర్నరీ కాలనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న దినేష్ కుమార్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. తన చిన్నారి పాపకు వైద్య చికిత్స నిమిత్తం సెప్టెంబర్ 4న దినేష్ కుమార్ కుటుంబంతో కలిసి చెన్నై వెళ్లారు. ఇల్లు తాళం వేసి ఉండటాన్ని గమనించిన వినోద్ కుమార్.. అదే అదునుగా భావించి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న సుమారు రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించాడు. పోలీసులు, సీసీటీవీ కెమెరాలకు దొరకకుండా ఉండేందుకు నిందితుడు వినోద్ కుమార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించాడు. చోరీ చేసే సమయంలో చొక్కా విప్పి తిరగడంతో పాటు, తన బైక్ నంబర్ ప్లేట్‌ను సైతం మార్చి మరీ ఈ దారుణానికి పాల్పడ్డాడు.అయినప్పటికీ సాంకేతికతను ఉపయోగించిన పోలీసులు నిందితుడిని నిఘా వేసి విజయవంతంగా అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన సుమారు రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రత

**తిరుమల(ఏడీఎన్ఎన్):**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడి) సర్వం సిద్ధం చేసింది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడం, భద్రతకు ఎక్కడ ఎలాంటి లోపం లేకుండా చూడట లక్ష్యంగా ఈసారి అధునాతన సాంకేతికతకు టీటీడీ పెద్దపీట వేసింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , జియో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీలను జోడించి సరికొత్త భద్రతా వ్యవస్థను అమలు చేస్తోంది.బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన గరుడ సేవ రోజున మాడ వీధులకు సుమారు 3.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇంత భారీ జనసందోహం ఉన్నప్పుడు సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు మొరాయించడం, వాకీటాకీల ఫ్రీక్వెన్సీలు ఓవర్‌ల్యాప్ కావడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. దీనిని నివారించేందుకు జియోతో కలిసి ప్రయోగాత్మకంగా 'నెట్‌వర్క్ వితిన్ ది నెట్‌వర్క్' పేరిట నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీని ప్రవేశపెట్టారు. దీని కింద 30 ప్రత్యేక కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. ఒకవేళ సాధారణ సిగ్నల్స్ జామ్ అయినా.. ఈ ప్రత్యేక పరికరాలు నేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 11 కీలక సబ్‌కంట్రోల్ పాయింట్ల వద్ద ఉన్నతాధికారులకు వీటిని కేటాయించనున్నారు. గ్యాలరీల్లో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఈసారి తొలిసారిగా ఏఐ మరియు సాఫ్ట్ వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను రంగంలోకి దించారు. ఇందుకోసం మొత్తం 200 కెమెరాలను అమర్చారు. గ్యాలరీలను ప్రత్యేక గ్రిడ్లుగా విభజించి, ప్రతి గ్రిడ్‌లోనూ ఎంతమంది భక్తులు ఉన్నారనే వివరాలను ఈ కెమెరాలు రియల్ టైమ్‌లో లెక్కిస్తాయి. ఏదైనా గ్యాలరీ తన సామర్థ్యానికి మించి నిండిపోతే వెంటనే అధికారులను అప్రమత్తం చేసి, భక్తులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.గ్యాలరీల నుంచి భక్తులు ఒకేసారి బయటకు వచ్చే సమయంలో తొక్కిసలాటలు, తోపులాటలు జరగకుండా ఈసారి దిశల వారీగా పకడ్బందీ ఎగ్జిట్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఏ మాడ వీధిలో ఉన్న భక్తులు అదే దిశలో వెలుపలకు వెళ్లేలా మార్గాలను నిర్దేశించారు. ముఖ్యంగా దక్షిణ మాడ వీధిలోని భక్తుల కోసం ఎస్3 గేట్ వద్ద ప్రత్యేక ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా ఆర్టీసీ బస్సుల్లో తిరుపతి లేదా తిరుమల బస్టాండ్‌కు సులభంగా చేరుకోవచ్చు.



## కాంగ్రెస్ పాలనకు పతనం మొదలైంది

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

శాసనసభ, మండలి సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, అసమర్థత పూర్తిగా బట్టబయలైందని బీఆర్ఎస్ ముఖ్య నేతలు తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ సంయుక్తంగా మీడియా సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై చర్చించే నైతిక స్థైర్యం లేకనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉభయ సభల్లో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేసిందని వారు దుయ్యబట్టారు.

**కుట్రలకు వేదికగా మండలి: మధుసూదనా చారి**

ప్రజా సమస్యలపై తాము ప్రతిపాదించిన 20 వాయిదా తీర్మానాలను ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టిందని, కేవలం బిల్లుల ఆమోదానికే ప్రాధాన్యత ఇచ్చిందని సిరికొండ మధుసూదనా చారి మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో కూడా ఎన్నడూ లేని విధంగా సభ లోపల, బయట పోలీసులను భారీగా మోహరించి, లైవ్ కవరేజీలోనూ తీవ్ర వివక్ష చూపారని ఆరోపించారు. సభను హుందాగా నడిపే చిత్తశుద్ధి లేక, ఆరు రోజుల పాటు మండలిని రాజకీయ కుట్రలకు వేదికగా మార్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సమావేశాల్లోనైనా ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని ఆకాంక్షించారు.

**కాంగ్రెస్ పతనకాలం మొదలైంది: దేశపతి శ్రీనివాస్**

అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పతనకాలం ఇప్పటికే ప్రారంభమైందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయంపై, ఎన్నికల హామీల అమలుపై సభలో ఎందుకు చర్చించలేదని నిలదీశారు. గతంలో కేసీఆర్ తన తొలి కేబినెట్‌లోనే 43 విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటే.. రేవంత్ రెడ్డి ప్రజలకు మేలు చేసే ఒక్క నిర్ణయమైనా తీసుకున్నారా అని ప్రశ్నించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులతో భౌతిక దాడులు (మ్యాన్‌హ్యాండ్లింగ్) చేయించిన నీచమైన పాలన కాంగ్రెస్‌దని ఆయన ధ్వజమెత్తారు.

**సర్వేలకు భిన్నంగా క్షేత్రస్థాయి పరిస్థితులు: ఎల్.రమణ**

తమ అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే సభలో ప్రభుత్వం ప్రతిపక్షాలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిందని ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆరోపించారు. అక్రమ కేసులతో అడ్డుకున్నప్పటికీ మండలిలో విద్యా, వ్యవసాయం, విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్, చేనేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశామన్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో మిగిలిపోయిన పది శాతం పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేయించుకున్న సర్వేలకు భిన్నంగా, క్షేత్రస్థాయిలో ప్రజల్లో ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

## నాటకాల వేదికగా తెలంగాణ భవన్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన 'మాక్ అసెంబ్లీ'పై తెలంగాణ రాష్ట్ర మత్స్య అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు మాక్ అసెంబ్లీ పేరుతో కపట నాటకాలు ప్రదర్శించారని, ఆ కార్యక్రమాన్ని చూస్తే 'జబర్దస్త్' కామెడీ షో కూడా దిగదుడుపేనని ఎద్దేవా చేశారు. వినాయక చవితి, దసరా నవరాత్రుల సమయంలో వీధి నాటకాలు వేసుకోవడానికి ఇకపై తెలంగాణ భవన్‌ను అద్దెకివ్వడం మంచిదని ఆయన సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ నేతల నటన నాటకరంగ సంస్థలను సైతం మించిపోయిందని సాయికుమార్ విమర్శించారు. మాక్ అసెంబ్లీలో పేజీల కొద్దీ డైలాగులు చెబుతూ, కపట ఏడుపులతో రక్తికట్టించారని.. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని తదితరులకు 'నవరస సార్వభౌమ', 'కళా ప్రపూర్ణ', 'కళా తపస్వి' వంటి బిరుదులు సరిపోతాయని, వచ్చే ఏడాది వారందరికీ 'గద్దర్ అవార్డులు' ఇవ్వాల్సిందేనని చురకలు అంటించారు. తెలంగాణ భవన్ ముందు 'ఇచ్చట నాటకాలు వేయబడును.. కపట నాటక సూత్రాలు నేర్పబడును.. నాటకాలకు భవనం అద్దెకు ఇవ్వబడును' అని బోర్డులు పెట్టుకోవాలని సూచించారు.




## భూ దందాలపై నిగ్గు తేల్చాలి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా, కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల నాటకాల కోసం సాగాయని బీజేపీ శాసనసభ పక్ష నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ స్టేట్ ఆఫీసులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్‌లో రూ.23 లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు తేలినా.. ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి భూములను ప్రభుత్వానికి ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని నిలదీశారు. కుత్బుల్లాపూర్‌లోని రూ.33 వేల కోట్ల విలువైన ఐడీపీఎల్ భూములను ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా ఎందుకు కాపాడటం లేదని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పేదల భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్ పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్న ప్రభుత్వం, మూసీ నదిలో పేదల ఆక్రమణల జోలికి ఎందుకు వెళ్లడం లేదన్నారు. ప్రభుత్వంలోని మంత్రుల వ్యవహారాలపై తమ వద్ద 200లకు పైగా ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ భూ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేకపోతే గవర్నర్‌ను కలిసి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆశ్రయించడంతో పాటు ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసం ముందు ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

## పదవుల కోసం కాదు.. ప్రజల కోసమే మా పోరాటం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే అత్యున్నత లక్ష్యాలుగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం రాజకీయాలు, పదవుల కోసం కాకుండా తెలంగాణ భవిష్యత్తు కోసం, రాష్ట్ర ప్రగతి కోసమే అంకితభావంతో పనిచేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం ఆయన తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో తన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డితో కలిసి ఉన్న ఒక పోస్ట్ ను పంచుకున్నారు."ఉత్తమ్ దంపతులు — రాష్ట్రం కోసం నిరంతర శ్రమ, ప్రజల కోసం అంకితభావం" అనే క్యాప్షన్‌తో పెట్టిన ఈ పోస్ట్ నెట్టింట ఆసక్తికరంగా మారింది. పరిపాలనలో రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక అడుగు, ప్రజల సంక్షేమం కోసం మరో అడుగు వేస్తూ ముందుకెళ్తున్నామని అందులో ఆయన పేర్కొన్నారు. ఉజ్వలమైన తెలంగాణ భవిష్యత్తు కోసం మంత్రిగా తాను, ఎమ్మెల్యేగా పద్మావతి రెడ్డి నిరంతర పోరాటం చేస్తున్నామని వివరించారు. ముఖ్యంగా "పదవుల కోసం కాదు... ప్రజల కోసం. రాజకీయాల కోసం కాదు... రాష్ట్ర ప్రగతి కోసం" అంటూ పోస్ట్ లో రాసుకొచ్చిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తమ రాజకీయ జీవితాలను పూర్తిగా ప్రజల సేవకే అంకితం చేశామని, ఉత్తమ్ దంపతుల ప్రయాణం ఎల్లప్పుడూ ప్రజల కోసం, రాష్ట్రం కోసమేనని వారు అందులో పునరుద్ఘాటించారు.కాగా, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఉత్తమ్ దంపతులకు కీలక ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ఒకరు క్యాబినెట్ మంత్రిగా, మరొకరు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. తమ నియోజకవర్గాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వీరు చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ రాజకీయ లక్ష్యాన్ని, నిబద్ధతను ప్రజలకు మరోసారి గుర్తుచేస్తూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

## టిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ వర్క్ షాప్ ప్రారంభం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



హైదరాబాద్‌లోని టిమ్స్ లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్ షాప్ ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆస్పత్రికి విచ్చేసి ఈ వర్క్ షాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ ఎక్విప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మంత్రి పరిశీలించారు. వాటి పనితీరు, వినియోగంపై నిపుణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

## మేము కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం

**వరంగల్ (ఏడీఎన్ఎన్) :**



కొండా సురేఖ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత తొలిసారిగా బహిరంగంగా స్పందించారు. తనపై, తన కుటుంబంపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఆమె విజ్ఞప్తి చేశారు. టీవీల్లో వస్తున్న వార్తలన్నీ ఊహాత్మకమని, కాంగ్రెస్ పార్టీని వీడి ఎక్కడికీ వెళ్లే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. వరంగల్‌లో ఆదివారం జరిగిన అభిమానులు, కార్యకర్తల సమావేశంలో ఆమె తన భర్త కొండా మురళితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. తనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేశారని ఎలాంటి బాధా లేదని, కానీ ఎలాంటి కారణం లేకుండానే తనను తొలగించారన్న ఆవేదన మాత్రం ఉందని అన్నారు. మంత్రిగా తనకు కేటాయించిన మూడు శాఖల్లో ఎక్కడా ఎలాంటి అవినీతికి పాల్పడలేదని ఆమె స్పష్టం చేశారు. ఎంపీపీ స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగానని, పదవి అనేది కేవలం అలంకారం మాత్రమేనని అన్నారు. మళ్లీ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీ చేసి నూరు శాతం గెలుస్తానని, మళ్లీ మంత్రి పదవి చేపడతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి తమకు ఫోన్లు వస్తున్నాయని, తన భర్త కొండా మురళికి పదవి ఇస్తారన్న సంకేతాలు ఉన్నాయని సురేఖ తెలిపారు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని సారయ్య తనను రాజీనామా చేయమనడం హాస్యాస్పదమన్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఆయనను తీవ్రంగా హెచ్చరించారు. తనను బర్తరఫ్ చేసిన రోజు అభిమానులు అల్లర్లు చేస్తామన్నప్పటికీ తామే వారిని వారించామన్నారు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని, తమకు అండగా నిలిచిన కార్యకర్తలకు ఎప్పుడూ రుణపడి ఉంటామని సురేఖ పేర్కొన్నారు.ఈ సమావేశంలో కొండా మురళి మాట్లాడుతూ.. పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తన కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఆమె 'ప్లాన్ బి' ఏమిటో తనకు తెలియదన్నారు. సురేఖ, తానూ కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని, తమ గెలుపు కోసం పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు పోరాడుతామన్నారు. కృతజ్ఞత అనేది తమ రక్తంలోనే ఉందని మురళి స్పష్టం చేశారు. కూతురు చేసిన వ్యాఖ్యలకు పార్టీకి క్షమాపణ చెప్పాలని, లేదంటే రాసి ఇవ్వాలని సురేఖను కోరానని, కానీ ఆమె అంగీకరించలేదని ఆయన వివరించారు. ఎన్ని రోజులు బతికామన్నది కాదు, ఎలా బతికామన్నదే ముఖ్యమని అన్నారు. పదవుల కోసం ఆశపడే వాళ్లం కాదని, గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయాక ఆయన ఇచ్చిన మంత్రి పదవి వద్దని పావురాల గుట్టలోనే రాజీనామా లేఖను పడేసి వచ్చామని గుర్తు చేశారు. ఎక్కడైనా తాను భూకబ్జాకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కొండా మురళి సవాల్ చేశారు.

## పోలీస్ కస్టడీకి ఆర్మీ మాజీ హవిల్దార్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం ఆర్మీ మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో అత్యంత కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆర్మీ మాజీ హవిల్దార్ మల్లేశ్‌ను పోలీసు కస్టడీకి అప్పగించేందుకు సికింద్రాబాద్ కోర్టు అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో ఎల్లుండి నుంచి నిందితుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని లోతుగా విచారించనున్నారు. అతడి వెనుక ఏమైనా పెద్ద నెట్‌వర్క్ ఉందా? ఆయుధాలను ఎవరికి అప్పగించాలనుకున్నాడు? అన్న కోణాల్లో ఆరా తీయనున్నారు. నిందితుడు వెల్లడించే వివరాలను ఎన్ఐఏ కి కూడా రాష్ట్ర పోలీసులు అందజేయనున్నారు.

**11 రోజుల ఉత్కంఠ.. సీసీటీవీల్లో నీడల విశ్లేషణ**

12 తుపాకులు, 2 వేల బుల్లెట్లు, నైట్ విజన్ బైనాక్యులర్స్ చోరీకి గురైన ఈ కేసు దర్యాప్తును పోలీసులు ఒక సస్పెన్స్ థ్రిల్లర్‌లా ఛేదించారు. 11 రోజుల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, మిలిటరీ అధికారులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సంయుక్తంగా పనిచేశాయి. ఈ ఆపరేషన్‌లో సుమారు 500 సీసీ కెమెరాలను సెకన్ టు సెకన్ పోలీసులు స్కానింగ్ చేశారు. రాత్రివేళల్లో వెలుతురు వల్ల పడే నీడలను సైతం వదలకుండా అనుమానంతో ట్రాక్ చేశారు. దాదాపు 20 నుంచి 30 నీడలను విశ్లేషించి, అవి మనుషులవి కావని నిర్ధారించుకున్నారు. నిరంతరంగా ఫుటేజీలను జల్లెడ పట్టి, టైం గ్యాప్ మేనేజ్‌మెంట్ ద్వారా మ్యాపింగ్ చేసి చివరకు నిందితుడు మల్లేశ్‌ను గుర్తించారు.

**ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు**

బొల్లారం పోలీసులు ముందుగా సాధారణ చోరీగా కేసు నమోదు చేసినప్పటికీ, మల్లేశ్ అరెస్టు తర్వాత స్వాధీనం చేసుకున్న ఆయుధాల ఆధారంగా అతనిపై ఆర్మ్స్ యాక్ట్ కింద కూడా అభియోగాలు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పోలీసులు కోర్టుకు అప్పగించనున్నారు. కస్టడీ విచారణలో ఈ భారీ చోరీ వెనుక ఉన్న అసలు కుట్రలు, ఇతర నిందితుల ప్రమేయంపై మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## రైతులను అరెస్టు చేయడం అమానుషం

**వికారాబాద్ (ఏడీఎన్ఎన్) :**



పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదంటూ ఆందోళన చేపట్టిన పరిగి మండలం కాడ్లాపూర్ రైతులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం అమానుషమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. అన్నదాతలకు కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వకుండా పోలీసులు ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంచి నటకిరీటి అని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కలతో కలిసి అసెంబ్లీలో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కేవలం సీఎం కుటుంబానికే కమిషన్లు వెళ్తున్నాయని, తనకు రావడం లేదనే బాధతోనే స్పీకర్ సభలో కన్నీళ్లు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు.స్పీకర్ కమిషన్ల కక్కుర్తి వల్లే వికారాబాద్‌లో ప్రధాన అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని ఆనంద్ ఆరోపించారు. గత ప్రభుత్వం రూ. 100 కోట్లతో మంజూరు చేసిన బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్‌ను కమిషన్లు అడగడంతో ఆయన పారిపోయారని, వికారాబాద్ పరిగి రోడ్డు పనులు, మోమిన్‌పేట్ మండలం ఎంకతల వద్ద పరిశ్రమల వాడ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లను కూడా ఇలాగే బెదిరించి పంపించేశారని ధ్వజమెత్తారు. ఎస్సీ కార్డును అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తూ ఆ వర్గాల ప్రజలను స్పీకర్ మోసం చేస్తున్నారని, ఎన్నికల్లో ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా రూ. 6 లక్షలు ఇప్పిస్తామని చెప్పి ఇప్పుడు అసెంబ్లీలో పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గ ప్రజలు కలిసేందుకు వస్తే మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా దర్శనమివ్వని దొరలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టడం మానుకుని, రైతులను, పేదలను ఆదుకుంటూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆనంద్ డిమాండ్ చేశారు.

## ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పెద్దపీట వేయాలి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



ఆస్తుల కంటే కుటుంబ విలువలే భవిష్యత్ తరాలకు మనం అందించే గొప్ప వారసత్వమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు నేటి సమాజంలో పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మన సంస్కృతికి ప్రతీక అయిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని విలువలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన పొన్నం సత్తయ్య ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు కొనియాడారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలు అందించిన వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డికి, సాహిత్య రంగంలో వెలిచాల కొండల్‌రావుకు, జానపద కళారంగంలో గొట్టె కనకవ్వకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ అవార్డు గ్రహీతలకు జ్ఞాపికతో పాటు రూ.50 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## తెలంగాణలో లోక్ అదాలత్ విజయవంతం



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 1,51,164 రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను రెండు పక్షాల అంగీకారంతో పరిష్కరించారు. ఇందులో అత్యంత కీలకంగా 3,896 సైబర్ మోసాల కేసులను పరిష్కరించి, బాధితులకు ఏకంగా రూ. 42.29 కోట్లను తిరిగి అందజేయడం విశేషం. లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన వాటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు ఉన్నాయి. అత్యధిక కేసులను పరిష్కరించిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944) అగ్రస్థానంలో నిలవగా.. ఖమ్మం (10,955), గద్వాల (8,469), వరంగల్ (8,404), మల్కాజిగిరి (8,109) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు కక్షిదారుల సమయం, డబ్బును ఆదా చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం.. న్యాయ సేవాధికార సంస్థలు, న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారుల సమష్టి కృషితోనే విజయవంతమైందని డీజీపీ పేర్కొన్నారు.



## దళిత ఆత్మగౌరవం కోసం మహాధర్నా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు నడిచిన మార్గాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటన, అలాగే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 'దళిత ఆత్మగౌరవ మహాధర్నా' నిర్వహించారు. మాల, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో 2026 సెప్టెంబర్ 13న జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి పలువురు రాజకీయ, మేధో ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఘటనలపై దళితులకు కేసీఆర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని, అలాగే స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి కూడా క్షమాపణ చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ ఉదంతంపై నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు.అసెంబ్లీ ఎదుట స్పీకర్‌ను దూషించడం, దళితులపై వివక్ష చూపడం రాజ్యాంగ వ్యతిరేకమని, ఇది ఆర్టికల్ 15ను ఉల్లంఘించడమేనని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. అంటరానితనం అంటే భౌతికంగానే కాకుండా మాటలతో కించపరచడం కూడా తీవ్ర నేరమేనని, కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద జరిగిన ఘటన శోచనీయమని ఆయన స్పష్టం చేశారు. దళితులు అడుగుపెట్టిన భూమిని పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని కేసీఆర్ సమర్థిస్తున్నారా అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రశ్నించారు. దళితుల కోసం ఏ మంచి పని చేసినా బీఆర్ఎస్ అడ్డుకుంటోందని, దళితులపై దాడులు జరుగుతున్నా బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు.ప్రజాస్వామ్యంలో దళితులు తిరిగిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడగడం కంటే క్రూరమైన చర్య మరొకటి ఉండదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. తప్పు చేసిన పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాల్సింది పోయి ఇలాంటి చర్యలకు పాల్పడటం హేయమన్నారు. దళితులను చిన్నచూపు చూసేవారికి కఠిన శిక్ష పడాలని, ఎన్నికల సమయంలో దళితులంతా ఐక్యంగా ఉండి తమ బలమేంటో చూపించాలని ఆయన పిలుపునిచ్చారు.



## సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రైతులు పూర్తిస్థాయిలో పంటలు సాగు చేసుకునేలా ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమ కాల్వ, వరద కాల్వ, ఏఎంఆర్‌పీ, లో లెవల్, ఎస్ఎల్‌బీసీ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలని, ఎడమ కాల్వకు ఎప్పటి వరకు నీరిస్తారో ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు.శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో తెలంగాణ వాటా కింద సుమారు 200 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, వాటిని రాష్ట్ర రైతుల అవసరాలకే పూర్తిస్థాయిలో వినియోగించాలని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం కనీసం కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) లేఖ కూడా రాయలేకపోయిందని ధ్వజమెత్తారు. కృష్ణా జలాల్లో జరుగుతున్న దోపిడీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే నీటి విడుదల షెడ్యూల్‌ను ఖరారు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని, రైతుల పక్షాన పోరాడేందుకు అవసరమైతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర సైతం చేపడతారని ఆయన హెచ్చరించారు.

సంక్షేమ మనసర్కార్

Follow: manasarkar

సోమవారం | హైదరాబాద్

14.09.2026

www.manasarkar.com

## రాశి ఫలాలు

**14-09-2026 సోమవారం**

**మేషం:**
భాగస్వామ్య చర్చలు ఫలిస్తాయి. ఉమ్మడి వ్యాపార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. ఆఫీసులో సంయమనం పాటిస్తే నూతన క్లయింట్లు లభిస్తారు.

**వృషభం:**
పనితీరుకు అధికారుల ప్రశంసలు దక్కుతాయి. క్లిష్టమైన సమస్యలను సులువుగా పరిష్కరిస్తారు. రిస్క్ పెట్టుబడులకు దూరంగా ఉండండి.

**మిథునం:**
మీ సంభాషణ చాతుర్యం ఆకట్టుకుంటుంది. ప్రాజెక్టులకు సరైన వ్యూహాలు రచిస్తారు. ఆర్థిక ఒప్పందాల పత్రాలను జాగ్రత్తగా చదవండి.

**కర్కాటకం:**
గురు గ్రహ బలంతో ఆర్థిక భద్రత లభిస్తుంది. ఆఫీసులో సహాయక సహకారాలు అందిస్తారు. భూమి, ఆస్తి రంగాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు మేలు.

**సింహం:**
అధికార పరిచయాలతో వ్యాపార ప్రయోజనాలు కలుగుతాయి. సమావేశాలు సత్ఫలితాలనిస్తాయి. అహంకారాన్ని వీడి అధికారులతో సత్సంబంధాలు కాపాడుకోండి.

**కన్య:**
బుధుడి ప్రభావంతో గణాంకాలు, బడ్జెట్ నిర్వహణ పక్కాగా సాగుతాయి. పెండింగ్ నివేదికలు పూర్తి చేసి ఆఫీసులో ప్రత్యేక గుర్తింపు పొందుతారు.

**తుల:**
మధురమైన మాటలతో ఆఫీసు వివాదాలు పరిష్కరిస్తారు. క్లయింట్లతో బంధం బలపడుతుంది. విలాస ఖర్చులు తగ్గించి బడ్జెట్ సమతుల్యం చేయండి.

**వృశ్చికం:**
పనులను రహస్యంగా, నిశ్శబ్దంగా పూర్తిచేయడం శ్రేయస్కరం. అనవసరపు రహస్య ఖర్చులను కట్టడి చేయండి. ఆధారాలు లేకుండా పెట్టుబడులు వద్దు.

**ధనస్సు:**
బృంద కృషితో ప్రాజెక్టులు పూర్తవుతాయి. సీనియర్ల సలహాలు కెరీర్‌కు తోడ్పడతాయి. తక్కువ నష్టభయం గల మార్గాల్లో పెట్టుబడులు పెట్టండి.

**మకరం:**
పని ప్రదేశంలో పలుకుబడి, గౌరవం పెరుగుతాయి. ఉన్నతాధికారుల మద్దతు లభిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధిపై దృష్టి పెట్టి పొదుపును కొనసాగించండి.

**కుంభం:**
విదేశీ ప్రాజెక్టులు, శిక్షణకు మంచి సమయం. కొత్త ఆలోచనలతో ముందుకు సాగండి. పొదుపును కాపాడుతూ షార్ట్‌కట్ సంపాదనలకు దూరంగా ఉండండి.

**మీనం:**
శని వక్రగతి వల్ల తొందరపాటు నిర్ణయాలు వద్దు. పనిలో సహనం, నిలకడ పాటించండి. అనవసర ఖర్చులను నియంత్రించి క్రమశిక్షణతో ముందుకు సాగండి.

## సైమా వేడుకల్లో మల్లారెడ్డి కోడలు హల్‌చల్

**బెంగళూరు (ఏడీఎన్ఎన్) :**



బెంగళూరు వేదికగా జరిగిన ప్రతిష్టాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ వేడుకలో తెలంగాణ మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టాలీవుడ్, కోలీవుడ్ తారలు, రాజకీయ, వ్యాపార ప్రముఖుల మధ్య ఆమె సెంటరాఫ్ అట్రాక్షన్‌గా మారారు. ఖరీదైన డిజైనర్ దుస్తులు ధరించి, స్టార్ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని గ్లామర్‌తో ఆమె రెడ్ కార్పెట్‌పై నడిచిన వైనం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విద్యాసంస్థల్లో తరచూ సినిమా ఈవెంట్లు, షూటింగ్‌లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలోనే సైమా నిర్వాహకులు ప్రీతి రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. సినీ పరిశ్రమతో నేరుగా ఎలాంటి సంబంధం లేకపోయినా, కెమెరాలకు ఆమె ఇచ్చిన ఫోజులు ఫోటోగ్రాఫర్లను విశేషంగా ఆకర్షించాయి. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఓ మహిళ ఫ్యాషన్ ప్రపంచంలో ఈ స్థాయిలో సందడి చేయడం పట్ల సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు నియామకం

**విజయనగరం (ఏడీఎన్ఎన్) :**



విజయనగరం జిల్లా వైసీపీలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా వైసీపీ అధిష్టానం కీలక నియామకాలు చేపట్టింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. దీనికి సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్ష బాధ్యతలను సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) నిర్వర్తించారు. అయితే ఇటీవల ఆయన పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ లో చేరడంతో ఆ పదవి ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో పార్టీని నడిపించేందుకు అనుభవజ్ఞుడైన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించింది.మరోవైపు జిల్లాలోని నెల్లిమర్ల నియోజకవర్గ రాజకీయాల్లోనూ వైసీపీ పెద్దఎత్తున మార్పులు చేపట్టింది. ఇప్పటివరకు నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తించిన అప్పలనాయుడిని ఆ బాధ్యతల నుంచి తొలగించారు. ఆయన స్థానంలో కొత్త సమన్వయకర్తగా గదల సన్యాసినాయుడిని నియమిస్తూ పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్తు రాజకీయ పోరాటాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకే అధిష్టానం ఈ తాజా నియామకాలు చేపట్టినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

## ఒంటరి మహిళ అనుమానాస్పద మృతి

**కర్నూలు (ఏడీఎన్ఎన్) :**



ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో ఒంటరి మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. కర్నూలు నగరంలో భార్యతో జరిగిన గొడవతో మనస్తాపం చెంది ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు.నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో రియాజున్నీసా (55) అనే ఒంటరి మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆమె నివాసముంటున్న ఇంటికి బయటి నుంచి తాళం వేసి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.మృతురాలి భర్త రహమతుల్లా రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కాగా, ఆయన రెండేళ్ల క్రితమే మరణించారు. వారికి పిల్లలు లేకపోవడంతో రియాజున్నీసా ఒంటరిగా జీవిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇంటి తాళం పగలగొట్టి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టారు.మరో ఘటనలో భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పింజరి నబీసా (37) మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో భార్య పింజరి మాబీతో ఆయనకు గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన నబీసా.. క్షణికావేశంలో ఇంట్లోని పైకప్పు కర్రకు చీరతో ఉరి వేసుకున్నాడు.దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై ఆయనను కిందకు దించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతిచెందినట్లు క్యాజువాలిటీ వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## పిడుగుల శబ్దాలకు ఇద్దరు వృద్ధురాళ్ల మృతి

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్) :**



పల్నాడు జిల్లాలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. నరసరావుపేట ప్రాంతంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం సమయంలో పడిన భీకర పిడుగుల శబ్దాలకు భయపడి ఇద్దరు మహిళలు గుండెపోటుతో మృతి చెందారు. వేర్వేరు గ్రామాల్లో జరిగిన ఈ ఘటనలు స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో తల్లపనేని నాగమ్మ (63) అనే మహిళ, అలాగే లక్ష్మీపురంలో మేకల వెంకాయమ్మ (60) అనే మరో మహిళ రాత్రి సమయంలో సంభవించిన భారీ పిడుగుల శబ్దాలకు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆ తీవ్ర భయాందోళనల కారణంగా ఇద్దరికీ గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రతిరోజూ సాయంత్రం లేదా రాత్రి వేళల్లో వర్షాలు పడుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు, విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. వర్షం పడే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో తలదాచుకోవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఆటోను ఢీకొన్న లారీ.. ముగ్గురు మృతి

**విజయనగరం (ఏడీఎన్ఎన్) :**



విజయనగరం జిల్లాలో ఆదివారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన లారీ ఆటోను ఢీకొన్న భీకర ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయవిదారక ఘటన దత్తిరాజేరు మండల పరిధిలోని షికారుగంజి జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దత్తిరాజేరు మండల పరిధిలోని షికారుగంజి జంక్షన్ వద్ద ఒక ఆటోను లారీ అత్యంత బలంతో ఢీకొట్టింది. లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగే ఈ ఘోర ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తేలింది. ఈ భీకర ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతులంతా బాడంగి మండలం, గజరాయనివలస గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే ముగ్గురూ ప్రాణాలు కోల్పోవడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. పోలీసులు వెంటనే మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో గజరాయనివలస గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఖైరతాబాద్‌లో కొలువుదీరిన పంచముఖ మహాగణపతి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



హైదరాబాద్ నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఖైరతాబాద్ బడా గణేశ్ విగ్రహ నిర్మాణం పూర్తయింది. ఈసారి ఖైరతాబాద్ గణనాథుడు 'పంచముఖ సంకటహర మహాగణపతి' అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నాడు. 69 అడుగుల భారీ ఎత్తుతో, ఐదు పడగలు, ఐదు ముఖాలతో ఈ విగ్రహాన్ని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మహాగణపతికి ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలను ఏర్పాటు చేయడంతో ఖైరతాబాద్ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.విగ్రహ నిర్మాణం పూర్తవడంతో నవరాత్రి ఉత్సవాల సందడి ఇప్పటికే మొదలైంది. బడా గణేశ్‌ను ముందస్తుగా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకుండా పరిసర ప్రాంతాల్లో బారికేడ్లను ఉంచారు. మరోవైపు, పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. షీ టీమ్స్, క్రైమ్ మఫ్టీ పార్టీ, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్, టాస్క్‌ఫోర్స్ బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. అడుగడుగునా సీసీ కెమెరాలతో నిఘా ఉంచి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

## ఆశ్రమ పాఠశాలలో బాలిక గర్భధారణ



**అడ్డతీగల (ఏడీఎన్ఎన్) :**

అల్లూరి సీతారామరాజు (పోలవరం) జిల్లా అడ్డతీగల మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకున్న దారుణ ఘటన కలకలం రేపింది. ఆ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఏపీ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. విద్యార్థిని పట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య మీడియాకు వెల్లడించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దూడ శాంతమతి, హాస్టల్ వార్డెన్ పల్లాల విజయగంధం, స్కూల్ టీచర్ కాకూరి లోవమ్మలను సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించడం, విధుల్లో పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ అఘాయిత్యం జరిగిందని ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపారు.ఈ అమానుష ఘటనకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వంటమనిషి మంగరాజుపై పోలీసులు పోక్సో చట్టం కింద కఠినమైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.మరోవైపు బాధిత బాలికకు ప్రభుత్వపరంగా మెరుగైన వైద్య సహాయం, నిపుణులతో ప్రత్యేక కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర శాఖాపరమైన విచారణ కొనసాగుతోందని, విచారణ నివేదిక పూర్తిగా వచ్చిన తర్వాత బాధ్యులపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.

## యూరియా బస్తాల కోసం క్యూ లైన్లలో రైతులు

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**



కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప, చేతల ప్రభుత్వం కాదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు కరెంట్, సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రైతులకు నిరంతరం 24 గంటల ఉచిత విద్యుత్ అందించి అండగా నిలిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోతలతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పువ్వాడ ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోవడం వంటి గత కాంగ్రెస్ రోజుల నాటి దుస్థితి మళ్లీ రాష్ట్రంలో పునరావృతమైందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రైతులు ఎంతో ఆత్మగౌరవంతో, దర్జాగా పొలాల్లో వ్యవసాయం చేసుకునే వారని, కానీ నేడు యూరియా బస్తాల కోసం యాప్‌ల పేరుతో రైతులను గంటల తరబడి క్యూ లైన్లలో నిలబెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ సస్యశ్యామలమైందని, రైతులకు నిజమైన భరోసా దక్కిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక

**రాజమండ్రి (ఏడీఎన్ఎన్) :**



తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన రాజమండ్రిలో ఓ అఘాయిత్యం తాలూకు దుష్పరిణామాలు తీవ్ర కలకలం రేపాయి. కేవలం 14 ఏళ్ల వయసున్న ఒక మైనర్ బాలికపై గతంలో లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడు.. ఇప్పుడు అదే కేసును వెనక్కి తీసుకోవాలని ఆమెపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చాడు. నిందితుడి బెదిరింపులు, మానసిక వేధింపులను భరించలేకపోయిన ఆ చిన్నారి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో సదరు చిన్నారిని అపహరించి, లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గాను రాజ్‌కుమార్ అనే వ్యక్తిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది.కోర్టులో కేసు విచారణ కొనసాగుతున్న తరుణంలోనూ నిందితుడు రాజ్‌కుమార్ తీరు మారలేదు. తనపై నమోదైన పోక్సో కేసును వెంటనే ఉపసంహరించుకోవాలంటూ ఆ బాలికను, ఆమె కుటుంబ సభ్యులను నిరంతరం టార్గెట్ చేశాడు. కేసు వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అంతు చూస్తానని నానావిధాలుగా బెదిరింపులకు గురిచేశాడు. నిందితుడి ఈ దారుణమైన మానసిక వేధింపులను తట్టుకోలేకపోయిన ఆ చిన్నారి తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించింది.కొద్దిసేపటి తర్వాత బాలిక పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడి వేధింపులపై కేసు నమోదు చేసుకున్నామని, బాధితురాలి కుటుంబానికి అండగా నిలిచి నిందితుడిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.



## బీసీ కులగణన శాస్త్రీయంగా జరపాలి

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

దేశవ్యాప్తంగా బీసీ కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ప్రతి కులానికి ఒక ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన చేపట్టాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో జరిగిన ఓబీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణన చేస్తామని చెప్పి మాట తప్పిన కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ ఎంపీలు గట్టిగా నిలదీయాలని కోరారు. దేశంలో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం దక్కాల్సిన రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం లభించాలంటే కచ్చితమైన కులగణన ఎంతో కీలకమని, ఇందుకోసం జనగణనలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ప్రత్యేక బీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారని, కేవలం కులం పేరును మాత్రమే నమోదు చేస్తే స్పెల్లింగ్, ఉచ్చారణ తేడాలతో అనేక కొత్త కులాలుగా నమోదయ్యే ప్రమాదం ఉందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. 2011లో సరైన వర్గీకరణ లేకపోవడం వల్లే లక్షలాది కులాలు ఉన్నట్లు నమోదైందని ఆయన గుర్తుచేశారు. ఒకే కులం ఒక రాష్ట్రంలో ఓసీగా, మరో చోట బీసీ, ఎస్సీ, ఎస్టీలుగా ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్త ఓబీసీ కులాల సమగ్ర జాబితాను రూపొందించాలని సూచించారు. సరైన కోడ్ వ్యవస్థను అమలు చేయని పక్షంలో.. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులు, సామాజిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

## భారీ వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

**పెద్దపల్లి (ఏడీఎన్ఎన్) :**



అల్పపీడన ప్రభావంతో పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింది. సింగరేణి పరిధిలోని నాలుగు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో రోజూ జరిగే సుమారు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అయితే రామగుండం ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రానికి బొగ్గు కొరత రాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలను సరఫరా చేస్తున్నారు.ఓపెన్ కాస్ట్ గనుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అంతర్గత రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఫలితంగా బొగ్గు రవాణా, వెలికితీత పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ యంత్రాలు సైతం ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. దీంతో అధికారులు అప్రమత్తమై పని ప్రదేశాల్లో చేరిన వరద నీటిని మోటార్ల ద్వారా బయటకు తోడేస్తూ, యంత్రాలు తిరిగి పనిచేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు ముమ్మరం చేశారు.

## మందుబాబులపై పోలీసుల కొరడా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



వీకెండ్ పార్టీలు ముగించుకుని మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న మందుబాబులకు సైబరాబాద్ పోలీసులు షాకిచ్చారు. కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 292 మంది పోలీసులకు చిక్కారు. వీరిలో అత్యధికంగా 240 మంది ద్విచక్ర వాహనదారులు ఉండగా, 40 మంది కారు డ్రైవర్లు, 12 మంది ఆటో డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారిలో 14 మంది వాహనదారులకు 301 నుంచి 550 మధ్య బీఏసీ పాయింట్లు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 292 మందిపై కేసులు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ వల్ల ప్రమాదం జరిగి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగితే.. భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని, ఈ నేరానికి గరిష్టంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా పడే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, గత వారంలో డ్రంకెన్ డ్రైవింగ్‌కు సంబంధించిన 681 కేసులను కోర్టులు పరిష్కరించాయని, అందులో 18 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారని, మరో ఏడుగురికి సామాజిక సేవ (సోషల్ సర్వీస్) శిక్ష పడిందని, మిగిలిన 656 మందికి జరిమానాలు వేశారని పోలీసులు వివరించారు.

## బస్సులో సీటు కోసం మహిళల కొట్లాట



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం మహిళల మధ్య తరచూ ఘర్షణలకు దారితీస్తోంది. తాజాగా పరిగి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఒక ఆర్టీసీ బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళల మధ్య మొదలైన చిన్న వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాటమాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరుకున్నారు.ఒక మహిళ ముందుగా దాడి చేయడంతో, ఆమెపై మరో ముగ్గురు మహిళలు మూకుమ్మడిగా దాడికి దిగారు. జుట్లు పట్టుకుని, ఒకరినొకరు నెట్టుకుంటూ పొట్టుపొట్టు కొట్టుకున్నారు. దీంతో బస్సులో కాసేపు తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. తోటి ప్రయాణికులు ఎంత నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. చివరకు డ్రైవర్ బస్సును ఆపి వారిని సముదాయించాల్సి వచ్చింది. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చిన తర్వాత బస్సుల్లో రద్దీ పెరగడం, సీట్ల కోసం మహిళలు ఇలా తరచూ దాడులకు దిగుతున్న దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో నిత్యం వైరల్ అవుతూనే ఉన్నాయి.



# మూడోసారి ఆసియా కప్ ఛాంపియన్‌గా భారత్

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి ఛాంపియన్‌గా అవతరించింది. చైనాలోని మోఖి వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాను మట్టికరిపించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మ్యాచ్ 17వ నిమిషంలో భారత క్రీడాకారిణి సానిక చంద్రకాంత్ మనే ఏకైక గోల్ చేసి జట్టు విజయానికి బాటలు వేసింది.ఈ విజయంతో భారత మహిళల జట్టు ఆసియా కప్ గెలవడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. 2023 ఎడిషన్‌లో దక్షిణ కొరియాను ఓడించి తొలిసారి టైటిల్ సాధించిన భారత్.. 2024 ఎడిషన్‌లో చైనాను ఓడించి రెండోసారి విజేతగా నిలిచింది. తాజాగా మరోసారి ఛాంపియన్‌గా నిలవడంతో పాటు జూనియర్ ప్రపంచ కప్‌లోనూ తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. హ్యాట్రిక్ సాధించిన భారత అమ్మాయిల జట్టుకు హాకీ ఇండియా భారీ నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. జట్టులోని ప్రతి క్రీడాకారిణికి రూ.3 లక్షలు, సహాయక సిబ్బందిలో ప్రతి ఒక్కరికీ రూ.1.5 లక్షల చొప్పున బహుమతి అందజేయనున్నట్లు వెల్లడించింది.



# హెడ్ కోచ్‌గా దాదా.. అసిస్టెంట్ కోచ్‌గా యువీ ?

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ఐపీఎల్ 2027 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీ భారీ ప్రక్షాళనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఫ్రాంచైజీ ఉమ్మడి యజమానుల ఒప్పందం ప్రకారం.. తదుపరి రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు జిందాల్ గ్రూప్ చేతికి రానుండటంతో కోచింగ్ బృందంలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. గత రెండు సీజన్లలో జీఎంఆర్ గ్రూప్ హయాంలో హెడ్ కోచ్‌గా వ్యవహరించిన హెమంగ్ బదానీ స్థానంలో.. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. గంగూలీ గతంలో డీసీకి డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా, మెంటార్‌గా సేవలందించిన విషయం తెలిసిందే.భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్‌ను సైతం అసిస్టెంట్ కోచ్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. ఆటగాడిగా అపార అనుభవం ఉన్న యువరాజ్‌కు ఐపీఎల్‌లో కోచ్‌గా ఇదే తొలి అవకాశం కానుంది. ఇక బౌలింగ్ విభాగంలోనూ కీలక మార్పులు జరగనున్నాయి. ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా శ్రీలంక మాజీ దిగ్గజం చమిందా వాస్‌ను, స్పిన్ బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రాను నియమించే అవకాశం ఉన్నట్లు స్పోర్ట్స్ స్టార్ నివేదిక వెల్లడించింది. ఇప్పటికే పంత్‌ను తిరిగి జట్టులోకి తీసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్.. ఈ దిగ్గజాల రాకతో మరింత బలోపేతం కానుంది. దీనిపై ఫ్రాంచైజీ నుంచి త్వరలో అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# మనీ మ్యూల్ ఖాతాలపై ఆర్‌బీఐ చర్యలు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)




దేశంలో సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, అక్రమ లావాదేవీలకు అడ్డుకట్ట వేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా మనీ మ్యూల్ ఖాతాల నియంత్రణ కోసం ఆర్‌బీఐ తాజాగా కొత్త నిబంధనల ముసాయిదాను సిద్ధం చేసింది. సైబర్ నేరాల ద్వారా వచ్చిన సొమ్మును దారి మళ్లించేందుకు వాడే అనుమానాస్పద ఖాతాలపై బ్యాంకులు విధించే తాత్కాలిక డెబిట్ హోల్డ్‌కు గరిష్ఠంగా 60 రోజుల గడువును ఈ నిబంధనల్లో ప్రతిపాదించారు.ఈ కొత్త మార్గదర్శకాలపై బ్యాంకులు, ప్రజల నుంచి అక్టోబరు 2 వరకు సూచనలు, అభిప్రాయాలను ఆర్‌బీఐ ఆహ్వానించింది. అందరి నుంచి వచ్చే అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం తుది మార్గదర్శకాలను 2027 ఏప్రిల్ 1 నుంచి అధికారికంగా అమల్లోకి తెస్తామని స్పష్టం చేసింది. అయితే, బ్యాంకులు కావాలనుకుంటే ముందుగానే స్వచ్ఛందంగా ఈ నిబంధనలను అమలు చేసుకోవచ్చని వెల్లడించింది. కృత్రిమ మేధ , మెషిన్ లెర్నింగ్ అత్యాధునిక సాంకేతికతల ద్వారా అనుమానాస్పద నగదు బదిలీలను బ్యాంకులు ఎప్పటికప్పుడు గుర్తిస్తాయి. రూ.1,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో జరిగే సందేహాస్పద బదిలీలను గుర్తించిన వెంటనే బ్యాంకులు ఆ మొత్తాలపై తాత్కాలికంగా డెబిట్ హోల్డ్ విధించవచ్చు.ఖాతాదారుడి సాధారణ లావాదేవీల శైలికి భిన్నంగా వ్యవహరించడం, ఖాతాలోకి భారీ మొత్తంలో నిధులు జమ కావడం, లేదా ఇప్పటికే సైబర్ నేరాల జాబితాలో ఉన్న అనుమానాస్పద ఖాతాలతో సంబంధాలు ఉండటం వంటి అంశాల ఆధారంగా వీటిని గుర్తిస్తారు. అయితే, కేవలం అనుమానం ఉన్న నిర్దిష్ట మొత్తానికే హోల్డ్‌ను పరిమితం చేయడం సాధ్యమైనప్పుడు.. పూర్తి ఖాతాను నిలిపివేయాల్సిన అవసరం లేదని ముసాయిదా స్పష్టం చేసింది. ఖాతా మొత్తాన్ని స్తంభింపజేయడం అనేది అన్నింటికంటే చివరి ప్రత్యామ్నాయంగా, కేవలం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఉండాలని పేర్కొంది.ఖాతాపై డెబిట్ హోల్డ్ విధించిన వెంటనే బ్యాంకులు ఆ విషయాన్ని ఖాతాదారుడికి తెలియజేయాలి. దీనికి దారితీసిన కారణాలు, హోల్డ్ ను తొలగించుకునే విధానం సంప్రదించాల్సిన బ్యాంకు అధికార వివరాలను స్పష్టంగా అందజేయాలి. ఆ లావాదేవీ లేదా ఖాతా పూర్తిగా చట్టబద్ధమైనదేనని నిరూపించుకునేందుకు ఖాతాదారుడికి 20 రోజుల సమయం ఇస్తారు.ఖాతాదారుడి నుంచి వివరణ అందిన తర్వాత బ్యాంకు అధికారులు దాన్ని పరిశీలించి, 10 రోజుల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలి.ఒకవేళ ఖాతాదారుడి నుంచి ఎలాంటి వివరణ రాకపోతే, హోల్డ్ విధించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా బ్యాంకు స్వయంగా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఖాతాదారుడు అందించిన వివరణ సంతృప్తికరంగా ఉంటే బ్యాంకు వెంటనే హోల్డ్‌ను ఎత్తివేయాలి. ఒకవేళ వివరణలో ఏవైనా అనుమానాలు వ్యక్తమైతే, ఆ వివరాలను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా పోలీసులకు తెలియజేయాలి. విచారణ అధికారి నుంచి హోల్డ్‌ను కొనసాగించాలని అధికారికంగా ఆదేశాలు వస్తే, బ్యాంకులు వెంటనే వాటిని అమలు చేయాలి.కేసును పోలీసులకు పంపిన తేదీ నుంచి 30 రోజుల్లోగా హోల్డ్ కొనసాగించాలనే ఆదేశాలు రాకపోతే, 31వ రోజున బ్యాంకులే స్వయంగా ఆ హోల్డ్‌ను తీసివేయాలి.పోలీసులు లేదా దర్యాప్తు అధికారుల నుంచి ఎలాంటి ప్రత్యేక ఆదేశాలు రాని పరిస్థితుల్లో.. తాత్కాలిక డెబిట్ హోల్డ్ గరిష్ఠంగా 60 రోజులు మాత్రమే అమల్లో ఉంటుంది. ఇందులో మొదటి దశ కింద బ్యాంకు పరిశీలన, ఖాతాదారుడు వివరణ ఇచ్చే సమయం కలిసి 30 రోజులు, ఆ తర్వాత దర్యాప్తు సంస్థ నుంచి వచ్చే స్పందన కోసం మరో 30 రోజులు కేటాయించడం జరిగింది.

# మహిళల ఆసియా కప్ విజేతగా టీమిండియా

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)




మహిళల ఆసియా కప్ 2026 విజేతగా భారత్ నిలిచింది. శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా 72 పరుగుల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. 184 పరుగుల భారీ లక్ష్యఛేధనలో బరిలోకి దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది. శ్రీలంక బ్యాటర్లలో కెప్టెన్ చమరి అటపట్టు (36) టాప్ స్కోరర్‌గా నిలవగా, నీలాక్షిక 22, విష్మి గుణరత్నె 20 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. భారత బౌలర్లలో తెలుగమ్మాయి శ్రీ చరణి (4/20) అత్యద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టగా, దీప్తి శర్మ (3/19) కూడా కీలక వికెట్లు తీసి మెరిసింది. అలాగే క్రాంతి గౌడ్, షెఫాలీ వర్మ, ప్రేమ రావత్ తలో వికెట్ పడగొట్టారు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ (68), స్మృతి మంధాన (59) అర్ధ శతకాలతో చెలరేగిపోగా, వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 77 బంతుల్లోనే 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం రిచా ఘోష్ (17), హర్మన్‌ప్రీత్ కౌర్ (14) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో మిధాలి అయోధ్య, చమరి అటపట్టు, ప్రభోధి తలో వికెట్ తీశారు.

# అఫ్గాన్‌పై టీమిండియా ఘన విజయం

ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆఫ్ఘానిస్థాన్ నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా కేవలం 13.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ వీరవిహారం చేశాడు. కేవలం 32 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 భారీ సిక్సర్ల సాయంతో 82 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లకు



చుక్కలు చూపించాడు. అతడికి తోడుగా ఇషాన్ కిషన్ 33 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 42 పరుగులు చేసి చక్కటి సహకారం అందించారు. ఆదిలోనే సంజు శాంసన్ (10 పరుగులు) ఔటైనప్పటికీ, అభిషేక్ శర్మ ఇషాన్ కిషన్ జోడీ అఫ్గాన్ బౌలింగ్‌పై విరుచుకుపడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. ఆఖర్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8 నాటౌట్), తిలక్ వర్మ (3 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ విజయంతో టీమిండియా సిరీస్‌ను ఘనంగా ప్రారంభించింది.

# యూఎస్ ఓపెన్ ఛాంపియన్‌గా ఎలీనా రిబకినా

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా మూడోసారి గెలుచుకుని హ్యాట్రిక్ సాధించాలనుకున్న స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి అరీనా సబలెంకా ఆశలకు ఎలీనా రిబకినా చెక్ పెట్టింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో రిబకినా 6-4, 5-7, 6-2 తేడాతో సబలెంకాపై అద్భుత విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. అయితే, హ్యాట్రిక్ మిస్ అవ్వడంతో పాటు ఫైనల్ ఓటమిని జీర్ణించుకోలేక పోయిన సబలెంకా తీవ్ర అసహనానికి గురైంది. మ్యాచ్ పాయింట్ కోల్పోయిన వెంటనే కోపంతో తన రాకెట్‌ను నేలకేసి బద్దలు కొట్టింది. తనను చిత్రీకరించేందుకు




ప్రయత్నించిన కెమెరామెన్‌పై కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఓటమితో గత 99 వారాలుగా ప్రపంచ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్న సబలెంకా ర్యాంక్‌కు బ్రేక్ పడింది. ఆమెను వెనక్కినెట్టి రిబకినా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. కజకిస్థాన్‌కు చెందిన రిబకినా కెరీర్‌లో ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. కాగా, ఒకే ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ లో నంబర్ వన్ ర్యాంకర్‌ను ఓడించిన రెండో టెన్నిస్ ప్లేయర్‌గా రిబకినా అరుదైన రికార్డు సృష్టించింది. 1995లో దిగ్గజ క్రీడాకారిణి స్టెఫీగ్రాఫ్ ఈ ఘనత సాధించగా.. 31 ఏళ్ల తర్వాత రిబకినా ఆ ఫీట్‌ను రిపీట్ చేసింది. మ్యాచ్ అనంతరం సబలెంకా మాట్లాడుతూ.. ఈ ఓటమితో తాను నిరాశ చెందలేదని, ఈ టోర్నీ నుంచి నేర్చుకున్న పాఠాలతో వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి వస్తానని స్పష్టం చేసింది.

# ఆసియా గేమ్స్ ఎంపికపై దివ్యాంశి క్లారిటీ

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ఆసియా గేమ్స్ నుంచి తనను తప్పించారని, తనకు చావే గతి అని వీడియో విడుదల చేసి సంచలనం సృష్టించిన వుషు అథ్లెట్ దివ్యాంశి ఎట్టకేలకు శాంతించింది. కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం సద్దుమణిగింది. మోకాలి గాయం తీవ్రత కారణంగా కోలుకోవడానికి సమయం పడుతుందని, అందుకే ఎంపిక చేయలేదని ఫెడరేషన్ తనకు నచ్చజెప్పిందని దివ్యాంశి తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించింది. భవిష్యత్తులో



దేశానికి పతకాలు తీసుకురావాలంటే ముందు ఆరోగ్యం ముఖ్యమని ఫెడరేషన్, క్రీడల మంత్రి తనకు వివరించారని ఆమె పేర్కొంది. 2030 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించేలా ఫెడరేషన్, సాయ్ (SAI) తనకు పూర్తి మద్దతు ఇస్తాయని విశ్వాసం వ్యక్తం చేసింది. అయితే, ఫెడరేషన్ విషయంలో వెనక్కి తగ్గిన దివ్యాంశి.. తన స్థానంలో ఎంపికైన తోటి అథ్లెట్ రోషిబినాపై మాత్రం తీవ్ర ఆరోపణలు చేసింది. జూన్ నుంచి రోషిబినా తనను, తన కుటుంబాన్ని మానసికంగా, శారీరకంగా హింసిస్తోందని మండిపడింది. ఓ అథ్లెట్ ఇంత నీచ స్థాయికి దిగజారుతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం తన దృష్టి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పైనే ఉంటుందని, తదుపరి గేమ్స్ కోసం సన్నద్ధం అవుతానని దివ్యాంశి స్పష్టం చేసింది.

# మండుతోన్న విమాన టికెట్ ధరలు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ పెద్దగా లేకపోయినా, టికెట్ ధరలు మాత్రం చుక్కలను తాకుతున్నాయి. దేశవ్యాప్తంగా 72 దేశీయ మార్గాల్లో 2025 మార్చి నుంచి 2026 జూన్ మధ్య సగటు విమాన ఛార్జీలు ఏకంగా 20.5 శాతం మేర పెరిగాయి. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అందించిన అధికారిక గణాంకాల ప్రకారం ఈ విషయాలు వెల్లడయ్యాయి. అయితే, వాస్తవ మార్కెట్ పరిస్థితుల ప్రకారం ఈ పెరుగుదల 35 శాతం వరకూ ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.గతంతో పోలిస్తే ఏడాది కిందట రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ఉన్న సగటు విమాన ఛార్జీలు, ప్రస్తుతం రూ.7,000 నుంచి రూ.7,500 వరకు చేరాయి. ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, విమాన మార్గం మరియు బయలుదేరే సమయాన్ని బట్టి ఈ ధరలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. ఇప్పట్లో విమాన ఛార్జీలు తగ్గేలా కనిపించడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు దేశీయ ప్రయాణికుల రద్దీ తగ్గుతున్నప్పటికీ, విమానయాన సంస్థలు మాత్రం ఛార్జీలను తగ్గించకపోగా మరింతగా పెంచుకుంటూ పోతున్నాయి. గిరాకీ ఎంత వేగంగా తగ్గుతోందో, అంతకంటే ఎక్కువ వేగంగా విమాన సర్వీసులను సంస్థలు కుదించుకుంటున్నాయి.



దీంతో ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టుగా సీట్ల లభ్యతను తగ్గించి, ఛార్జీలు తగ్గించాల్సిన అవసరం లేకుండా సంస్థలు జాగ్రత్తపడుతున్నాయి.జనవరిజులై మధ్య కాలంలో దేశీయ ప్రయాణికుల రద్దీ అంతక్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే కేవలం 0.64 శాతం మాత్రమే పెరిగింది. గత ఐదేళ్లలో ఇదే అత్యంత కనిష్ఠ వృద్ధి రేటు కావడం గమనార్హం. ఇక ఒక్క జులై నెలలోనే రద్దీ 5 శాతం మేర తగ్గింది. అయితే, విమానయాన సంస్థలు మాత్రం ప్రయాణికుల రద్దీ తగ్గుదల కంటే వేగంగా తమ సర్వీసుల్లో కోత పెట్టాయి. ఒక్క జులై నెలలోనే ప్రముఖ విమానయాన సంస్థ 'స్పైస్‌జెట్' ఏకంగా 38 శాతం మేర తన సర్వీసులను తగ్గించుకుంది. మరోవైపు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్, ఇండిగో సంస్థలు కూడా 3 నుంచి 19 శాతం వరకు సర్వీసులను తగ్గించాయి. సర్వీసులు తగ్గడంతో తక్కువ సీట్లు అందుబాటులోకి వచ్చాయి, ఫలితంగా గిరాకీ తగ్గినా టికెట్ ధరలు మాత్రం పెరిగాయి. ప్రయాణికుల రద్దీ తగ్గడం, సర్వీసుల కోత ఒకెత్తయితే.. మరోవైపు విమానయాన సంస్థలకు ముడి చమురు ధరల పెరుగుదల రూపంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చుల్లో సింహభాగం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ కొనుగోలుకే ఖర్చవుతోంది. దీనికి తోడు పాకిస్తాన్ గగనతలంపై ఉన్న ఆంక్షలు, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు చల్లారకపోవడం వంటి పరిణామాలు సమస్యను మరింత జటిలం చేశాయి. ఆ ప్రాంతాల గుండా వెళ్లలేక విమానాలు ఇతర మార్గాల్లో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుండటంతో అదనపు ఇంధనం ఖర్చవుతోంది.ఇదిలా ఉండగా, 2024 జులైతో పోలిస్తే ఈ ఏడాది జులై నాటికి ఏకంగా 10,000 వరకు సర్వీసులు తగ్గిపోయాయి. కరోనా కాలం నాటి సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో సర్వీసులు మళ్లీ తగ్గడం గమనార్హం.ఈ గడ్డు పరిస్థితుల్లో విమానయాన సంస్థలు చేపట్టిన సర్వీసుల కోత చర్యల వల్ల ప్రయాణికుల సీట్ల భర్తీ రేటు మాత్రం బాగానే ఉంది. ఈ ఏడాది జులైలో ప్రతి 100 సీట్లకు సగటున 85.3 సీట్లు భర్తీ అయ్యాయి. వర్షాకాలం వంటి సాధారణ రోజుల్లోనూ ఈ స్థాయిలో సీట్లు నిండటానికి సర్వీసులు తగ్గించడమే ప్రధాన కారణం. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, ఇప్పట్లో విమానయాన కంపెనీలు ఛార్జీలు తగ్గించే ఆలోచన చేసే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# ఏఐ అభివృద్ధికి కళ్లెం వేయాలన్న ఆంథ్రోపిక్ సీఈఓ

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతుండటం పట్ల టెక్ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న పదేళ్లలో ఏఐ కారణంగా పది శాతానికి పైగా మనుషుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆంత్రోపిక్ పరిశోధకుడు ఇవాన్ హుబింగర్ ఇటీవల హెచ్చరించగా.. తాజాగా ఆ సంస్థ సీఈఓ డారియో అమోడెయ్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ సాంకేతిక వేగానికి ఇకనైనా కళ్లెం వేయాలని, సామర్థ్యాల పెంపును కాస్త తగ్గించాలని ఆయన టెక్ కంపెనీలను కోరారు. విశేషం ఏమిటంటే.. ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్ మన్, ఎక్స్‌ఏఐ అధిపతి ఎలాన్ మస్క్ సైతం డారియో హెచ్చరికలకు మద్దతు తెలిపారు.స్వయంగా తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకునే 'సూపర్‌ఇంటెలిజెన్స్' వ్యవస్థలను రూపొందిస్తుండడంతో, ఏఐలో ప్రమాదకర మార్పులు వస్తున్నాయని డారియో ఆందోళన వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ ఏజెంట్లు ఇప్పటికే బాహ్య వ్యవస్థలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని



గుర్తుచేశారు. ఏఐని ఇదే విధంగా వదిలేస్తే త్వరలోనే అది స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను సృష్టిస్తుందని, మరో 6 నుంచి 12 నెలల్లో అలాంటి సమూహాలు మొత్తం ఇంటర్నెట్‌ను తమ స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే జరిగితే ప్రపంచవ్యాప్తంగా వందల బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా, ఆంత్రోపిక్‌కు చెందిన 'క్లాడ్' చాట్‌బాట్‌ను ఇరాన్‌కు మద్దతిస్తోన్న యెమెన్‌లోని హూతీ ఉగ్రవాదులు క్షిపణుల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు ఆంత్రోపిక్ ఇటీవల తన నివేదికలో వెల్లడించడం గమనార్హం. ఈ నేపథ్యంలో డారియో తాజా హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మూడుదశల ప్రణాళిక. తాను సాంకేతిక పురోగతిని పూర్తిగా నిలిపివేయాలని చెప్పట్లేదని, అయితే భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి ఏఐ కంపెనీలకు మరింత సమయం అవసరమని డారియో స్పష్టం చేశారు. ఏఐ వేగానికి బ్రేకులు వేయడానికి ఆయన ఈ సందర్భంగా ఒక 'మూడుదశల ప్రణాళిక' ను వివరించారు.

**మొదటి దశ:** ఏఐ వినియోగంలో భద్రతను ఎప్పటికప్పుడు ధ్రువీకరించడానికి ప్రతి కంపెనీలోనూ స్వతంత్ర భద్రతా నిపుణులను నియమించి నిరంతరం పర్యవేక్షించడం.

**రెండో దశ:** కఠినమైన భద్రతా ప్రమాణాలను నెలకొల్పడానికి, అనియంత్రిత అభివృద్ధిని నిరోధించడానికి అగ్రగామి ఏఐ సంస్థలన్నింటి మధ్య సమన్వయం ఉండటం.

**మూడో దశ:** రోజురోజుకూ శక్తిమంతమవుతున్న ఏఐ వ్యవస్థల వల్ల భవిష్యత్తులో మునుముందు ఎదురయ్యే ప్రమాదాలను గుర్తించి, సమర్థంగా ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాల మధ్య గట్టి సహకారం ఉండటం.



# నాతో పెట్టుకోవద్దు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన మైదానంలో తన ఆటతీరుతోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ పలు సవాళ్లను ఎదుర్కొన్నారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్ లో పాల్గొన్న ఆమె వ్యాఖ్యాత అడిగిన ఒక ప్రశ్నకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. వ్యాఖ్యాత రాజ్ షమాని 'మీ జీవితంలో అత్యంత కఠినమైన రాత్రి ఏది?' అని ప్రశ్నించగా.. స్మృతి కొద్దిసేపు కన్నీళ్లు ఆపుకుంటూ మౌనంగా ఉండిపోయారు. అనంతరం తేరుకుని, 'బహుశా ఏదైనా ప్రపంచకప్ కావచ్చు' అని బదులిచ్చారు. అయితే, వ్యక్తిగత జీవితంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా, తాను కేవలం క్రికెట్ గురించే మాట్లాడుతానని ఆమె స్పష్టం చేశారు.ఈ ఇంటర్వ్యూలో తన కోపం గురించి కూడా ఆమె ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. తాను చూడటానికి అలా కనిపించకపోయినా, తనలో కోపం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. 'నేను ఎవరి దారిలోకి వెళ్లను.. నా దారిలోకి ఎవరూ రావద్దు. నాతో పెట్టుకోవద్దు. నేను ప్రతీకారం తీర్చుకునే రకం కాదు, కానీ ఎవరైనా బాధపెడితే మాత్రం ఆ విషయాన్ని మర్చిపోను. వారిని క్షమిస్తాను తప్ప ఆ ఘటనను మాత్రం మర్చిపోను. నేను ఎవరికీ చెడు చేయాలని అనుకోను' అని స్మృతి మంధాన స్పష్టం చేశారు.



# డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ ధరలపై సెబీ కీలక నిర్ణయం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

స్టాక్ మార్కెట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ కారణంగా ఎక్స్‌పైరీ రోజున డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ ధరల నిర్ణయంలో తలెత్తిన ఆందోళనలకు పరిష్కారం చూపేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఇండెక్స్, సింగిల్ స్టాక్ డెరివేటివ్స్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ సెటిల్‌మెంట్ ధరను ఎలా నిర్ణయించాలన్న అంశంపై రెండు ప్రత్యామ్నాయాలను ముందుకు తెచ్చింది. ఈ ప్రతిపాదనలపై మార్కెట్ భాగస్వాములు అక్టోబర్ 3 వరకు తమ అమూల్యమైన అభిప్రాయాలను సమర్పించవచ్చని స్పష్టం చేసింది.ఈక్విటీ క్యాష్ మార్కెట్‌లో సీఏఎస్‌ను సెబీ గత ఆగస్టు 3 నుంచి విజయవంతంగా అమల్లోకి తీసుకొచ్చింది. షేర్లకు మరింత పారదర్శకంగా క్లోజింగ్ ప్రైస్‌ను నిర్ణయించడమే ఈ కొత్త విధానం ప్రధాన ఉద్దేశం. అయితే, ఎక్స్‌పైరీ రోజుల్లో సీఏఎస్ సమయంలో ఇండెక్స్ ఆప్షన్స్‌లో భారీగా ట్రేడింగ్ జరగడం, ఇండెక్స్ స్థాయిల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు కనిపించడంతో డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ ధరపై పలువురు మార్కెట్ భాగస్వాములు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన సెబీ.. ప్రస్తుత విధానాన్ని సమగ్రంగా సమీక్షించనున్నట్లు ఇటీవల ప్రకటించింది.ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు సెబీ బ్లెండెడ్ వీవ్యాప్, సీటీఎస్ వీవ్యాప్ అనే రెండు ప్రత్యామ్నాయ సెటిల్‌మెంట్ విధానాలను సూచించింది. సీఏఎస్ అనేది సరికొత్త వ్యవస్థ కావడంతో మార్కెట్ వర్గాలకు దానిపై పూర్తిస్థాయిలో అవగాహన రావడానికి కొంత సమయం ఇవ్వాలని భావిస్తోంది. అందువల్ల వెంటనే 'బ్లెండెడ్ వీవ్యాప్'కు మారకుండా, కనీసం ఏడాది పాటు 'సీటీఎస్ వీవ్యాప్'ను కొనసాగించాలని ప్రతిపాదించింది. సీఏఎస్ సమయంలో కనిపించే ఇండికేటివ్ ఇండెక్స్ వాల్యూ ప్రదర్శనపై కూడా సెబీ కీలక ప్రతిపాదన చేసింది. వేలంలో ఉన్న ఆర్డర్ల ఆధారంగా రూపొందే ఇండికేటివ్ ఈక్విలిబ్రియం ప్రైస్ వాస్తవ ట్రేడ్ ధర కానందున, దాని ఆధారంగా రూపొందే ఇండెక్స్ విలువను ప్రదర్శించకుండా నిలిపివేసే అవకాశం ఉందని పేర్కొంది. వ్యక్తిగత షేర్లకు సంబంధించిన ఐఈపీలను మాత్రం కొనసాగించాలని తెలిపింది. సెటిల్‌మెంట్ విధానంతో పాటు సీటీఎస్, సీఏఎస్, డెరివేటివ్స్ ట్రేడింగ్ మధ్య సమయ సమన్వయాన్ని కూడా సెబీ పునఃపరిశీలిస్తోంది. ఇందులో భాగంగా ట్రేడింగ్ సమయాల్లో మార్పులు, సీఏఎస్ ముగిసిన తర్వాత డెరివేటివ్స్ ట్రేడింగ్ వ్యవధిని ఐదు నిమిషాలకు పరిమితం చేయడం వంటి పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది.




# జిందాల్ స్టీల్ అరుదైన ఘనత

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

దేశీయ ఉక్కు దిగ్గజం జిందాల్ స్టీల్ లిమిటెడ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. వ్యర్థాల నుంచి సంపద సృష్టించవచ్చని నిరూపిస్తూ ప్రపంచ రికార్డును కైవసం చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ వద్ద ప్రపంచంలోనే అత్యంత పొడవైన స్టీల్ స్లాగ్ రహదారిని నిర్మించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. స్టీల్ తయారీ ప్రక్రియలో వెలువడే వ్యర్థాన్ని 'స్టీల్ స్లాగ్'గా పిలుస్తారు. సాధారణంగా పారవేసే ఈ వ్యర్థాన్ని అత్యంత ఉపయోగకరమైన రోడ్డు నిర్మాణ సామగ్రిగా మలచడంలో జిందాల్ స్టీల్ సఫలమైంది.ప్రత్యేకతలివే.. అధునాతన సాంకేతికత: కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తో జిందాల్ స్టీల్ జట్టుకట్టి ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతం చేసింది. భారీ వినియోగం: దాదాపు 2 లక్షల టన్నుల ప్రాసెస్ చేసిన స్టీల్ స్లాగ్‌ను ఉపయోగించి 1.85 కిలోమీటర్ల పొడవైన ఈ అత్యాధునిక రోడ్డును నిర్మించారు. ఖర్చు ఆదా దీర్ఘకాలిక మన్నిక: సాధారణ రోడ్లతో పోలిస్తే స్టీల్ స్లాగ్ రహదారులు చాలా కాలం పాటు మన్నుతాయని శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. అంతేకాకుండా రోడ్డు నిర్మాణ ఖర్చు 30 నుంచి 40 శాతం వరకు తగ్గడంతో పాటు, భవిష్యత్తులో నిర్వహణ వ్యయాలు కూడా చాలా తక్కువగా ఉంటాయి.ఈ సందర్భంగా జిందాల్ స్టీల్ లిమిటెడ్ ఛైర్మన్, ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నవీన్ జిందాల్ మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక రంగాల సమిష్టి కృషితో దేశ నిర్మాణానికి అవసరమైన విలువైన వనరులను తయారు చేయవచ్చని తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా పారిశ్రామిక వ్యర్థాల నుంచి సంపదను సృష్టించవచ్చని, స్టీల్ స్లాగ్ రోడ్డు నిర్మాణం ఇందుకు చక్కటి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
14.09.2026
www.manasarkar.com



## కాశ్మీర్ అంటే హింస కాదు అదొక భూతల స్వర్గం

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

సంగీత సంచలనం ఏఆర్ రెహమాన్ కాశ్మీర్ అంశంపై సినీ దర్శకుల ఆలోచనా విధానంలో మార్పు రావాలని పిలుపునిచ్చారు. వెండితెరపై కాశ్మీర్ అనగానే కేవలం హింస, ఉగ్రవాదం, వివాదాలనే ఎక్కువగా చూపించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఉద్రిక్తతలకు పెద్దపీట వేయడం వల్ల సాధారణ ప్రజల్లో ఆ ప్రాంతం పట్ల ఒక రకమైన భయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కాశ్మీర్ కేవలం వివాదాస్పద ప్రాంతం కాదని, అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి నిలయమైన భూతల స్వర్గమని గుర్తుచేశారు. సినిమా అనేది ప్రజల మనస్సులపై తీవ్ర ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమం కాబట్టి.. దర్శకులు హింసాత్మక కోణాన్ని పక్కనపెట్టి, అక్కడి పచ్చని లోయలు, నదులు, ప్రశాంత వాతావరణాన్ని, ప్రజల సహజ జీవన విధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని కోరారు. ప్రతికూల అంశాల కంటే సానుకూల విషయాలను తెరపైకి తీసుకురావడం ద్వారా సమాజంలో మంచి సందేశం వెళ్లడంతో పాటు, పర్యాటకరంగం కూడా పుంజుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కళ అనేది మనుషులను, ప్రాంతాలను అనుసంధానించే వారధిలా పనిచేయాలి తప్ప, భయాందోళనలు పెంచేదిగా ఉండకూడదని స్పష్టం చేశారు. హింస కంటే శాంతికి, విధ్వంసం కంటే ప్రకృతి సౌందర్యానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే కాశ్మీర్ నిజమైన అందం ప్రపంచానికి అర్థమవుతుందని రెహమాన్ వివరించారు.



## దశాబ్ద కాలంలో తొలి తమిళ చిత్రంగా ఘనత!

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

జాతీయ అవార్డు గ్రహీత కీర్తిసురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన తాజా చిత్రం 'దోరతీ'. జియో స్టూడియోస్, సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఇళయరాజా స్వరాలు సమకూర్చారు. ఆయన కెరీర్‌లో ఇది 1540వ సినిమా కావడం విశేషం. సెప్టెంబర్ 25న థియేటర్లలోకి రానున్న ఈ సినిమా విడుదలకు ముందే అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. కెనడాలోని ప్రతిష్ఠాత్మక టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టిఫ్) లోని సెంటర్‌పీస్ విభాగంలో ఈ చిత్ర వరల్డ్ ప్రీమియర్ ప్రదర్శన ఘనంగా జరిగింది. గత దశాబ్ద కాలంలో ఈ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శితమైన మొట్టమొదటి తమిళ సినిమాగా 'దోరతీ' చరిత్ర సృష్టించింది. స్కొనిబాంక్ థియేటర్‌లో జరిగిన ఈ ప్రీమియర్ షోకు కీర్తిసురేశ్, కార్తీక్ సుబ్బరాజ్, నిర్మాతలు గునీత్ మోంగా, అచిన్ జైన్ సహా తదితర చిత్ర బృందం హాజరై సందడి చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ.. "ఇది నేను చాలా కాలంగా నా మనసులో మోస్తున్న కథ. కేవలం హంగుల కోసమే కాకుండా.. స్నేహం, ప్రేమతో పాటు మానవ సంబంధాలు, కులం, పురుషత్వం, కరుణ వంటి సున్నితమైన అంశాలను ఇందులో లోతుగా చూపించాం. ఇలాంటి గ్లోబల్ వేదికపై మా సినిమా ప్రయాణం ప్రారంభం కావడం గర్వంగా ఉంది" అని సంతోషం వ్యక్తం చేశారు.




## జక్కన్న రూల్ బ్రేక్ చేసిన పృథ్వీరాజ్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'వారణాసి'. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో, అటవీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ పాన్ వరల్డ్ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్, మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఇందులో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ తన పాత్ర చిత్రీకరణను పూర్తి చేశారు. సాధారణంగా జక్కన్న సినిమా పూర్తయ్యేవరకు నటీనటులు వేరే ప్రాజెక్టులు చేయరు. కానీ, పృథ్వీరాజ్ ఆ రూల్‌ను బ్రేక్ చేసి 'వారణాసి' ప్రీ ప్రొడక్షన్ నుంచి ఇప్పటివరకు ఏకంగా 9 సినిమాలు పూర్తి చేయడం విశేషం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించి కేవలం మూడు వారాల ప్యాచ్ వర్క్ మాత్రమే మిగిలి ఉందని, త్వరలోనే ప్రచార చిత్రాలను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోందని సమాచారం. శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా తొలి భాగాన్ని 2027 ఏప్రిల్ 7న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రెండో భాగం 2029లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 'బేబీ' పోస్టర్లను చెప్పులతో కొట్టారు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

బేబీ సినిమాతో టాలీవుడ్‌లో ఒక్కసారిగా సెన్సేషన్ సృష్టించి, ఓవర్ నైట్ స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి వైష్ణవి చైతన్య.. ఇటీవల 'ఎపిక్' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న కష్టాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో ఎదురైన విపరీతమైన నెగెటివిటీని గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు ఈ సక్సెస్ రాత్రికి రాత్రే రాలేదని, కవర్ సాంగ్స్, షార్ట్ ఫిల్మ్స్, పలు సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ ఎంతో శ్రమించి ఈ స్థాయికి చేరుకున్నానని ఆమె వివరించారు. 'బేబీ' విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి అత్యంత అసభ్యకరంగా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లను చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దృశ్యాలు చూశాక ఎంతో కుంగిపోయానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తన కష్టానికి ఇలాంటి అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అని తీవ్రమైన మానసిక వేదనను అనుభవించినట్లు వైష్ణవి వెల్లడించారు. అయితే, కాలం గడిచేకొద్దీ ఆ నెగెటివిటీని పట్టించుకోవడం మానేశానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆ చేదు అనుభవాలను పక్కనపెట్టి, కేవలం తన వృత్తిపై, సానుకూల అంశాలపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించినట్లు ఆమె పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## ఆసక్తి రేకెత్తిస్తున్న 'ఇమ్మోర్టల్' ట్రైలర్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :


మ్యూజిక్ డైరెక్టర్, నటుడు జీవీ ప్రకాశ్‌కుమార్, కయాదు లోహర్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇమ్మోర్టల్'. మరియప్పన్ చిన్నా దర్శకత్వంలో ఏకే ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై అరుణ్‌కుమార్ ధనశేఖరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనున్న నేపథ్యంలో, చిత్ర బృందం ప్రమోషన్ల వేగం పెంచింది. ఇందులో భాగంగానే తాజాగా ఈ సినిమా తమిళ వర్షన్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్‌ను బట్టి చూస్తుంటే చిత్రాన్ని ఆద్యంతం ఉత్కంఠభరితమైన కామెడీ, సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా ట్రైలర్‌లోని సన్నివేశాలు సినిమా కథపై మరింత క్యూరియాసిటీని పెంచేలా ఉన్నాయి. యువ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, సభ మారన్, ఆదిత్య కతిర్, అర్జు మహర్జన్, సునీతా శ్రేష్ఠ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచుతుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.



## ఓనం రేసులో నివిన్ పౌలీ సంచలనం

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

మలయాళ చిత్ర పరిశ్రమలో ఈసారి ఓనం పండుగ రేసులో స్టార్ హీరోలను వెనక్కి నెట్టి నివిన్ పౌలీ సంచలన విజయం నమోదు చేశారు. దుల్కర్ సల్మాన్ 'ఇమ్ గేమ్', పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఖలీఫా' వంటి భారీ చిత్రాలు పోటీలో ఉన్నప్పటికీ, నివిన్ పౌలీ హీరోగా నటించిన 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్' బాక్సాఫీస్ వద్ద రికార్డులను బద్దలు కొడుతోంది. ఇటీవల బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న మమితా బైజు ఇందులో కథానాయిక కావడం ఈ చిత్రానికి మరింత ప్లస్ అయింది. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బలమైన కంటెంట్‌తో పుంజుకుని, ఏకంగా రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయికి చేరువ కావడం విశేషం. ఆగస్ట్ 21న విడుదలై 23 రోజులు గడుస్తున్నా నైట్ షోలలో 73.17 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేయడం దీని విజయానికి నిలువెత్తు సాక్ష్యం. సెప్టెంబర్ 4న తెలుగులోనూ విడుదలై ఆదరణ పొందుతోంది. మరోవైపు సెప్టెంబర్ 3న విడుదలైన దుల్కర్ సల్మాన్ 'ఇమ్ గేమ్' పది రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.46.65 కోట్లు రాబట్టి నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. అయితే నివిన్ పౌలీ జోరు ముందు ఇవి కొంత వెనుకబడ్డాయి. భారీ ఇమేజ్ కంటే బలమైన కథే సినిమాను గెలిపిస్తుందని ఈ చిత్రం మరోసారి నిరూపిస్తూ సౌత్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



## 'క్రేజీ కళ్యాణం' బరాత్ సాంగ్!

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, సీనియర్ నటుడు నరేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ల వేగం పెంచింది. ఇందులో భాగంగానే శనివారం ఈ సినిమా నుంచి ఒక హుషారైన పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు. ''కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక'' అంటూ సాగే ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే కాకుండా స్వయంగా ఆలపించడం విశేషం. కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం పాటకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఈశ్వర్ పెంటి కొరియోగ్రఫీలో అనుపమ పరమేశ్వరన్ వేసిన ఎనర్జిటిక్ స్టెప్పులు ఈ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్యామ్ దూపాటి ఛాయాగ్రహణం, శ్రావణ్ కటికనేని కూర్పు ఈ చిత్రానికి అదనపు బలాన్ని చేకూరుస్తున్నాయి. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.



## పైలట్‌ను పెళ్లాడిన నటి ఐశ్వర్య దేవన్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

తెలుగు సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన మలయాళ అందం ఐశ్వర్య దేవన్ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. కేరళకు చెందిన పైలెట్ అవినాష్ సోమశేఖరన్‌తో ఆమె ఏడు అడుగులు నడిచి దాంపత్య జీవితాన్ని ప్రారంభించారు. వారం క్రితం కేరళలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య వీరి వివాహం వేడుకగా జరిగింది. ఈ పెళ్లికి సంబంధించిన అందమైన ఫోటోలను నటి ఐశ్వర్య తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ కావడంతో నూతన దంపతులకు సినీ ప్రముఖులతో పాటు నెటిజన్లు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కేరళకు చెందిన ఐశ్వర్య మోడలింగ్ రంగం నుంచి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2011లో విడుదలైన 'కెరటం' అనే తెలుగు చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ భామ.. ఆ తర్వాత తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో పలు అవకాశాలు దక్కించుకున్నారు. ముఖ్యంగా ధనుష్ సరసన 'అనేకుడు', పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'సింహాసనం' చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. అందం, అభినయంతో ఆకట్టుకున్న ఐశ్వర్య 2017లో ప్రతిష్ఠాత్మక 'ఫెమినా మిస్ ఇండియా మహారాష్ట్ర' కిరీటాన్ని సైతం సొంతం చేసుకున్నారు. 2018లో వచ్చిన 'కాశీ ఇన్ సెర్చ్ ఆఫ్ గంగా' అనే హిందీ చిత్రంలో చివరిసారిగా కనిపించిన ఆమె.. గత కొన్నేళ్లుగా వెండితెరకు దూరంగా ఉంటున్నారు. ఇప్పుడు వివాహంతో సరికొత్త జీవితంలోకి అడుగుపెట్టి మరోసారి వార్తల్లో నిలిచారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**